Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 36 పేజీలు 8 వెల : 5 గురువారం 24 జూలై 2025



ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్న విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....


మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజీ |
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఫ్రంట్ పేజీ : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

### విశాఖకు నాలుగు ప్రతిష్ఠాత్మక సంస్థలు..

# ఎస్ఐపీబీ ఆమోదం

అమరావతి: ఏపీలో రూ.20వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 4 కంపెనీల ఏర్పాటుకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. ఈ కంపెనీల ద్వారా 50వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్తు పెట్టుబడులు, అవసరాలకు తగ్గట్లుగా విశాఖ మాస్టర్ ప్లాన్ ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిష్ఠాత్మక సంస్థల రాకతో విశాఖ ఇమేజ్ పెరుగుతుందని మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రూ.16,466 కోట్లతో సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ సంస్థ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. విశాఖపట్నంలో మొదటిదశలో ఆ సంస్థ రూ.1,466 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 200 మందికి ఉపాధి లభించనుంది. రెండో దశలో 15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా 400 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. విశాఖపట్నంలోని మధురవాడలో సాత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పెట్టుబడులు పెడుతుండగా, 25,000 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండాడ (విశాఖ)లో రూ.1,250 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 15,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మధురవాడలో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తద్వారా 10,000 ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# కంచగచ్చిబౌలి భూములపై విచారణ



### తదుపరి విచారణ 13కు వాయిదా

న్యూఢిల్లీ: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. వాదనలు విన్న అనంతరం ఈ విచారణని ఆగస్టు 13వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల్లో చేపట్టిన పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన చర్యలపై తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌పై రి÷-లపై దాఖలుకు ప్రతివాదులు సమయం కోరారు. ప్రతివాదుల విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేసింది సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అన్ని చర్యలు తీసుకున్నట్లు- తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది ప్రభుత్వం. కంచ గచ్చిబౌలి భూముల్లో అనుమతులు లేకుండా చెట్లు- కొట్టేసిన వ్యవహారంపై సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది సుప్రీంకోర్టు. గత విచారణ సందర్భంగా...

స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో తెలంగాణ ప్రభుత్వం స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసింది.



# పెట్టుబడులే లక్ష్యంగా కూటమి కృషి

### మనమిత్ర ద్వారా మెరుగైన సేవలు

### పారిశ్రామికవేత్తల సదస్సులో లోకేశ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మన మిత్ర ద్వారా మెరుగైన సేవలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని ఏపీ విద్య, ఐటీ-శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. గతంలో ఎయిర్‌పోర్ట్ ఎలా ఒక ప్రాంతం రూపురేఖలు మార్చిందో చూశామని తెలిపారు. తెలంగాణ జీడీపీలో ఎయిర్‌పోర్ట్ వల్ల ఆదాయం 17శాతం నుంచి 18శాతానికి పెరిగిందని వివరించారు. ఏపీలో పెట్టుబడులు ప్రోత్సహించడమే లక్ష్యంగా పారిశ్రామిక వేత్తలతో బుధవారం విజయవాడలో సమ్మిట్ నిర్వహించారు. యూఏఈ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది. భారత్- యూఏఈ ఆర్థిక సంబంధాల బలోపేతంపై మంత్రి నారా లోకేష్ ఈ సదస్సులో ప్రసంగించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అమరావతిలో గేమ్ చేంజర్ అవుతుందని మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. ఎవ్వరూ క్వాంటమ్ గురించి మాట్లాడనప్పుడు తాము క్వాంటమ్ యూజ్ కేసుల గురించి మాట్లాడుతున్నామని తెలిపారు. ఏఐ మంత్రిని కలిగి ఉన్నా మొదటి దేశం యూఏఈ అని వెల్లడించారు. ఏపీ ఇప్పుడు ఏఐని అడాప్ట్ చేసుకుని హ్యాకథాన్‌లు నిర్వహిస్తోందని వ్యాఖ్యానించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని కొంతమందిలో ఆందోళన ఉందని.. అయితే పారిశ్రామిక విప్లవం మరిన్ని ఉద్యోగాలు తెచ్చిందని అన్నారు. అలా ఏఐ కూడా చాలా ఉద్యోగాలు తెస్తోందని.. ఏఐ మనకు వే ఆఫ్ లైఫ్ అని చెప్పారు. దీన్ని బేసిక్ డ్రాఫ్టింగ్‌కు వాడతానని చెప్పుకొచ్చారు లోకేశ్.

ఈ సమావేశం సారాంశాన్ని సమ్మరైజ్ చేయడానికి ఏఐని ఉపయోగిస్తున్నానని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# నిరుపేదలకు అండగా నిలవాలి

### వారికి ఆసరా అందించి స్థిరపడేలా చేయాలి

### ఫిక్కీ మహిళా పారిశ్రామికవేత్తలతో కలెక్టర్



విజయవాడ:ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న నిరుపేదలకు ఆసరాను అందించి, జీవితంలో స్థిరపడేలా ఫిక్కీ మహిళాపారిశ్రామికవేత్తలు మార్గదర్శకులుగా నిలవాలని.. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో అమలుచేస్తున్న పీ4 విధానంలో భాగస్వాములుగా ముందుకురావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ విజయవాడ ప్రతినిధులతో బుధవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో పీ4 విధానం అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి, 2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించాలనే లక్ష్యంతో పీ4 విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పేదలు పూర్తిస్థాయిలో పేదరికం నుంచి బయటపడలేకపోతున్నారనే విషయాన్ని గుర్తించి, పీ4 విధానంలో మార్గదర్శులు ద్వారా నిరుపేదలైన బంగారు కుటుంబాలను ఎంపిక చేసుకొని వారిని దత్తత తీసుకోవడం ద్వారా ఆయా కుటుంబాలు వారు ఆర్థికంగా, కుటు-ంబ పరంగా ఆశించిన స్థాయిలో ఆర్థిక, ఆరోగ్య పరిపుష్టిని సాధించేవరకు చేయూతనివ్వడం ముఖ్య ఉద్దేశమన్నారు. పీ4 విధానం ద్వారా బంగారు కుటు-ంబాన్ని ఎంపిక చేసుకొని ఆ కుటు-ంబంవారు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించి విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి

అంశాల్లో ఆసరా ఇచ్చేందుకు ఆర్థిక పరిపుష్టి సాధించిన వారు మార్గదర్శులుగా ముందుకురావాలని సూచించారు. జిల్లాలో 86 వేల బంగారు కుటు-ంబాలను గుర్తించడం జరిగిందని, ఇప్పటికే దాదాపు 3,700 మంది మార్గదర్శులు ముందుకురావడం అభినందనీయమన్నారు.

# పల్నాడు జిల్లాలో దారుణం

### తండ్రీకొడుకుల దారుణ హత్య

### నిందితుడు గడ్డం అనిల్ కుమార్ రెడ్డి అరెస్ట్




2లో..

# విశాఖతో నాకు మంచి అనుబంధం ఉంది

### నా వ్యాఖ్యలను కొందరు విమర్శిస్తున్నారు

### వారంతా కూపస్థ మండూకాలు మాత్రమే

### విశాఖలో హరిహరవీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్



2లో..

# పార్లమెంట్‌లో ఆగని విపక్షాల రగడ



### మూడోరోజూ ఉభయసభలు వాయిదా

2లో..

# భారత్- పాక్ కాల్పులపై ట్రంప్ వ్యాఖ్యలు

### వివరణ ఇవ్వడంలో ప్రధాని మోడీ విఫలం

### మండిపడ్డ విపక్షనేత రాహుల్ గాంధీ



2లో..

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్ పార్టీకి మలుపు అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తమ పార్టీ సిద్ధమని కేటీఆర్ చెప్పారు. లోకల్ బాడీ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి ప్రీ ఫైనల్స్ లాంటివన్నారు. ఎన్నికలకు బీఆర్ఎస్ కార్యకర్తలు సన్నద్ధం కావాలని కూడా ఈ సందర్భంగా కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మళ్ళీ కేసీఆర్ కీలకం కావాలంటే.. స్థానిక సంస్థల ఎన్నికలు ముఖ్యమని కేటీఆర్ చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్లో కేటీఆర్ పార్టీ శ్రేణులతో భేటీ అయిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. లోకల్ బాడీ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దన్న కేటీఆర్.. పోటీచేసే అభ్యర్థులపై స్థానిక బీఆర్ఎస్ నేతలు ఏకాభిప్రాయానికి రావాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని, కాంగ్రెస్ కార్యకర్తల్లాగా పనిచేస్తున్న అధికారులంతా అప్పుడు సెట్ రైట్ అవుతారని కెటిఆర్ అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రీ ఫైనల్ లాంటివని, కేటీఆర్ టికెట్ ఎవరికి ఇచ్చినా వారిని గెలిపించుకోవాలని పార్టీ క్యాడర్‌కు సూచించారు. వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ వారిని పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. పాలిచ్చే బర్రెను పక్కనపెట్టి ఎగిరితన్నే దున్నపోతును తెచ్చుకున్నట్టు- అయిందని తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. ఆరు గ్యారంటీల పేరుతో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇవాళ తెలంగాణ ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. మీసేవ కార్యాలయాల్లో ఇచ్చే రేషన్ కార్డులను

జారీచేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపెద్ద సభల్లో గప్పాలు కొట్టుకుంటున్నాడని విమర్శించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలువండి. మిమ్మల్ని ఏ అధికారి వేధించడు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న అంతులేని వ్యతిరేకతను అందిపుచ్చుకోవాలి.



అభ్యర్థితో సంబంధం లేకుండా కారు గుర్తుకు ఓటు-వేసే లాగా ప్రజలను చైతన్యపరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం లోని అన్ని మండలాలు, జిల్లా పరిషత్ స్థానం బీఆర్ఎస్‌దే అవుతుంది. సమైక్య పాలనలో తెర్లు అయిన తెలంగాణను బాగు చేయాలన్న లక్ష్యంతో పదేండ్లు అధికారంలో ఉండి దీక్షగా పనిచేశాం. కేసీఆర్ నాయకత్వంలో ఓ తపస్సులాగా తెలంగాణలోని సబ్బండ వర్ణాల సంక్షేమం కోసం పాటు-పడ్డాం. ఆనాడు ప్రజల కోసం పనిచేస్తూ పార్టీ నాయకులను పట్టించుకోకపోవడం వాస్తవం. రేపు అధికారంలోకి వచ్చాక గతంలో చేసిన తప్పును పునరావృతం చేయం. అటు- ప్రభుత్వాన్ని, ఇటు- పార్టీని సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యకర్తలు, నాయకులను కళ్లలో పెట్టు-కుని చూసుకుంటాం' అన్నారు. వికారాబాద్ ప్రజల దశాబ్దాల స్వప్నమైన జిల్లాను ఏర్పాటు- చేసి సరిగా చెప్పుకోలేపోయాం. వికారాబాద్‌కు మెడికల్, నర్సింగ్ కాలేజీ వస్తుందని కలలో కూడా ఎవరూ అనుకోలేదు. కానీ కేసీఆర్ దాన్ని సాకారం చేశారు. పెన్షన్లు 2000 అవుతాయని, రైతుబంధు ఠంచన్‌గా పడుతుందని, రుణమాఫీ అవుతుందని, రైతు బీమా చేస్తారని, బాలింతలకు కేసిఆర్ కిట్ ఇస్తామని ఎవరూ ఊహించలేదు. కానీ అవన్నీ చేసి చూపించాం. అయితే వాటిని సరిగా ప్రజలకు చెప్పుకోలేకపోయాం. ఆడబిడ్డలకు 300 కోట్ల రూపాయలు వడ్డీలేని రుణాలను ఇచ్చి ఏదో ఘనకార్యం చేసినట్టు- కాంగ్రెస్ సంబురాలు చేసుకుంటుంది. కానీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆడబిడ్డలకు 3000 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలు ఇచ్చారు. కానీ ఏనాడూ దాన్నొక గొప్ప పనిలాగా చెప్పుకోలేదు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ముఖ్యమంత్రితో సహా కాంగ్రెస్ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కాని అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లు 6.5 లక్షల రేషన్ కార్డులను అర్హులకు ఇచ్చాం. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 90 వేల కార్డులు ఇచ్చాం. అయితే ఈ పనులు అన్నింటిని ఏవో ఘనకార్యాలుగా మేము ఎన్నడూ భావించలేదు. ప్రజలకు రొటీ-న్‌గా చేసేవే అనుకున్నాం. అయితే మీసేవ సెంటర్‌లో ఇచ్చే రేషన్ కార్డులకు కూడా ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపెద్ద సభలు పెట్టి చెప్పుకుంటున్నాడు అని కేటీ-ఆర్ విమర్శించారు.ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసింది. పెన్షన్ తీసుకునే పెద్దమనుషులకు రేవంత్ రెడ్డి 40 వేల రూపాయలు బాకీ ఉన్నాడు. ఆడపిల్లలకు ఐదు లక్షల భరోసా కార్డు, స్కూటీలు, నెలకు 2,500 రూపాయలు ఇస్తా అన్నాడు. కానీ ఏమి చేయలేదు. ప్రస్తుతం తెలంగాణలోని ప్రతీ ఆడబిడ్డకు రేవంత్ రెడ్డి 50 వేల రూపాయలు బాకీ ఉన్నాడు. రాహుల్ గాంధీ ఫోటోతో గ్యారెంటీ- కార్డులు ఇచ్చి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ నాయకులు అరచేతిలో వైకుంఠం చూపించారు. 11 సార్లు రైతుబంధు వేసి ఏనాడు కేసీఆర్ రాజకీయం చేయలేదు. అన్నదాతలకు న్యాయం చేశామనే అనుకున్నారు. నాట్లు- వేసేటప్పుడు ఇవ్వకుండా ఓట్లు-వేసే -టైముకు రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తున్నాడు. అధికారంలోకి వచ్చిన 20 నెలలో ఒకసారి మాత్రమే రైతుబంధువేసి దానికి సంబరాలు చేసుకోవాలని చెప్తున్నాడు' అని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి పత్తా లేకుండా పోయాడు. ముఖం బాగా లేక అద్దం పగలగొట్టుకున్నట్టు- రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తున్నాడు. ఆయనకు పాలన చేతగాక సమర్థత లేక రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం చేతకాని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేసీఆర్‌ను

నిందిస్తున్నాడని మండిపడ్డారు.

# విచారణ పేరుతో వేధిస్తున్నారు

హైదరాబాద్,:ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మరోసారి సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరుతో సిట్ అధికారులు వేధిస్తున్నారని పిటిషన్ దాఖలు చేశారు. విచారణ పేరుతో తరుచూ పోలీస్ స్టేషన్‌కు పిలుస్తున్నారని వాపోయారు. ఆగస్టు 4వ తేదీన ప్రభాకర్ రావు పిటిషన్ విచారణకు రానున్నట్లు- సమాచారం. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ చేయకుండా ప్రభాకర్ రావుకు కల్పించిన వెసులుబాటును కొట్టేయాలని ఇప్పటికే సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్.. ఈ కేసు నమోదు కాగానే విదేశాలకు పారిపోయాడు. పోలీసులు ఒత్తిడి, అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించడంతో తిరిగి హైదరాబాద్ వచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు అవుతున్నారు. ఇప్పటికే సిట్ అధికారులు ప్రభాకర్ రావును పలుమార్లు విచారించారు.

# పల్నాడు జిల్లాలో దారుణం

బాపట్ల: ఉమ్మడి ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం పాత మాగులూరు శివారులో తండ్రీ కొడుకు దారుణ హత్యకు గురయ్యారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కోర్టు వద్ద తండ్రి కొడుకులు వీరాస్వామి రెడ్డి, ప్రశాత్ రెడ్డిని బుధవారం కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేసి.. కారులో తరలించారు. ఆ తరవాత వారిని శివారులో గొంతుకోసి హత్య చేశారు. ఈ ఘటనలో ప్రధాని నిందితుడు గడ్డం అనిల్ కుమార్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా నిందితుడు గడ్డం అనిల్ కుమార్ రెడ్డిని విచారిస్తున్నారు. అయితే ఆర్థిక లావాదేవీల్లో విబేధాల కారణంగానే వీరిద్దరిని ప్రత్యర్థులు హత్య చేశారని పోలీసులు వివరించారు. కిడ్నాప్ చేస్తుండగా ఈ విషయాన్ని అక్కడే ఉన్న స్థానికులు చూసి.. ఆ కారును బైక్‌పై వెంబడించారు. అంతేకాకుండా.. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఇక ఈ తండ్రీ కొడుకులను సంతమాగులూరు మండలం పాత మాగులూరు వద్దనున్న రియల్ ఎస్టేట్ వెంచర్‌లోకి తీసుకు వెళ్లి.. వారి గొంతు కోసం హత్య చేశారు. ఇంతలో బైక్‌పై వచ్చిన స్థానికులతోపాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆ క్రమంలో వారంతా కలిసి.. ఈ కేసులో ప్రధాన నిందితుడు అనిల్ కుమార్ రెడ్డిని పట్టుకున్నారు. మరోవైపు గొంతు కోయడంతో ఆ తండ్రీకొడుకులు ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. వారి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బాధిత కుటుంబికులు.. ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఇక ఈ ఘటనలో నిందితులు ఉపయోగించిన స్కార్పియో కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య వెనుక ఎవరెవరూ ఉన్నారనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

## భారత్- పాక్ కాల్పులపై ట్రంప్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: భారత్ -పాక్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25 సార్లు చెప్పారని, దీనిపై కేంద్రం వివరణ ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రం ఏమని చెబుతుంది. ట్రంప్ కాల్పుల విరమణ చేయించారనా ? కానీ అలా చెప్పలేరు. అయినా అదే నిజం. ఇది కేవలం కాల్పుల విరమణ వరకే కాదు. మనం చర్చించాల్సిన చాలా పెద్ద సమస్యలు ఉన్నాయి. కాల్పుల విరమణ చేయించినట్టు 25 సార్లు ట్రంప్ చెప్పారు. అసలు ట్రంప్ ఎవరు ? అది ఆయన పనికాదు. ప్రధాని సమాధానం ఇవ్వడం లేదు. అది వాస్తవం అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించామని మంగళవారం కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఈ ఘర్షణలో ఐదు విమానాలు కూలిపోయినట్టు చెప్పారు. కాకపోతే.. ఏ దేశానివో మాత్రం వెల్లడించలేదు. ఈ ఘర్షణ అణుయుద్ధం వరకు వెళ్లేదన్నారు. రెండు వైపులా యుద్ధ విమానాలు కూలిపోయినట్టు- పేర్కొన్నారు. మరోవైపు ఇటీవల జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌డోభాల్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ భారత్ వైపు నష్టం జరిగినట్టు- కనీసం ఓ గాజు పెంకునైనా చూపించాలని సవాల్ చేయడం గమనార్హం.

# పార్లమెంట్‌లో ఆగని విపక్షాల రగడ

న్యూఢిల్లీ: ప్రభుత్వ మొండి వైఖరితో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా మూడవ రోజు ఎలాంటి చర్చ లేకుండా తుడిచిపెట్టుకుపోయాయి. బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ బుధవారం ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్లకార్డులు ప్రదర్శిస్తూ చర్చ జరపాల్సిందేనని పట్టుబట్టాయి. బుధవారం ఉదయం ప్రారంభమైన వెంటనే ఉభయ సభలు మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి. తిరిగి సమావేశమైన వెంటనే మరో రెండుసార్లు వాయిదా పడ్డాయి. మంగళవారం కూడా పార్లమెంటు ఎలాంటి కార్యకలపాలను నిర్వహించలేదు. రాజ్యసభ ప్రారంభం కాగానే బీహార్ ఎస్ఐఆర్ సహా పలు అంశాలపై చర్చ జరపాలంటూ రూల్ 267 కింద ప్రతిపక్షాలు 25 నోటీసులిచ్చాయి. బెంగాలీ వలసకార్మికులపై వివక్ష మరియు దేశంలో పెరుగుతున్న విమాన ప్రమాద ఘటనలు సహా మరికొన్ని అంశాలను లేవనెత్తారు. అయితే ఈ నోటీ-సులను డిప్యూటీ- చైర్మన్ హరివంశ్ రాయ్ తిరస్కరించారు. వెంటనే ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. శ్రీలంక నావికాదళం భారతీయ జాలర్లను అరెస్ట్ చేసిన అంశాన్ని లేవనెత్తేందుకు డిఎంకె ఎంపి వైకో యత్నించారు. అయినప్పటికీ ప్రభుత్వం మొండిపట్టు-దలతో చర్చకు తిరస్కరించింది. నిరసనల మధ్య ఎగువ సభ గురువారానికి వాయిదా పడింది. లోక్‌సభలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. వివిధ అంశాలపై చర్చ

జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. వెల్‌లోకి దూసుకువెళ్లారు. మొదట చైర్మన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన కొంతసేపటికే సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు- చైర్మన్ ప్రకటించారు. ఎలాంటి చర్చ, కార్యకలాపాలు లేకుండా ఉభయ సభలు గురువారానికి వాయిదా పడ్డాయి.

# నక్షా లేని గ్రామాలకు తుదిరూపు

హైదరాబాద్,: దశాబ్దాలుగా రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని వీలైనంత త్వరితగతిన ఆ ఐదు గ్రామాల్లో సర్వే బౌండరీస్ యాక్ట్ ప్రకారం నక్షా మ్యాప్ నకు తుదిరూపునిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో రీసర్వేపై ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి వి. లోకేష్ కుమార్, సర్వే ల్యాండ్‌సెటిల్ మెంట్ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిజాం కాలం నుంచి 413 గ్రామాలకు నక్షాలు లేవని గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఈ గ్రామాలను గాలికి వదిలేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినేతృత్వంలోని



ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి , ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాల్లో డ్రోన్ /ఏరియల్ మరియు ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ రోవర్ పద్ధతుల్లో సర్వే నిర్వహించామని తెలిపారు. నిబంధనల ప్రకారం భూ యజమానులకు నోటీసుల జారీ చేయడం, గ్రామ సభలు నిర్వహించి యజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరి భూములకు సర్వే హద్దులను ఖరారు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ఐదు గ్రామాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలోపెట్టు-కొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు- చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల మనోభావాలు, ఆలోచనలకు అనుగుణంగా వారు సంతృప్తి చెందేవిధంగా నక్షా మ్యాప్ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఏం చేసినా అంతిమంగా సామాన్య ప్రజలు, రైతుల సంతోషమే ప్రధానమన్నారు. భూములు అమ్మకం, కొనుగోలు సందర్భంలో హద్దులతో కూడిన సర్వే మ్యాప్ ను ఖచ్చితంగా జత పరచాలని అలాగే దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో భూములకు కూడా భూదార్ నెంబర్ కేటాయించాలని భూభారతి చట్టంలో స్పష్టం చేయడం జరిగిందని ఈ ఐదు గ్రామాలలో ఈ రెండు అంశాలను అమలు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ ఐదు గ్రామాలలో ఐదు గుంటలకు పైగా ఉన్నభూములకు కొత్తగా సర్వేనెంబర్లు ఇవ్వాలని, అలాగే రెవెన్యూ, ఫారెస్ట్, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉంటే వాటి వివరాలను కూడా రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, ఐదు గ్రామాలకు చెందిన ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వే నిర్వహించిన ఏజన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విశాఖతో నాకు మంచి అనుబంధం ఉంది



విశాఖపట్నం: తనకు విశాఖతో మంచి అనుబంధం ఉందని అగ్ర కథానాయకుడు, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఇదే విషయాన్ని చెబితే.. 'పవన్‌కల్యాణ్ ఎక్కడికి వెళ్తే అక్కడే పుట్టాను.. అక్కడే పెరిగాను అంటాడు' అంటూ కొందరు విమర్శిస్తుంటారని, అయితే వాళ్లంతా కూపస్థమండూకాలని, అంతకు మించి ఆలోచించలేరని చురకలంటించారు. తన పేరే పవన్ అన్న ఆయన.. అంతా ఉంటానని అన్నారు. పవన్‌కల్యాణ్ కీలక పాత్రలో నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు' విశాఖలో ప్రీ-రిలీజ్ వేడుక జరిగింది. ఈ మూవీ జులై 24న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా విశాఖతో నాకు మంచి అనుబంధం ఉంది. నటనలో ఓనమాలు ఇక్కడే

దిద్దుకున్నా. నా గురువు సత్యానంద్ ఉత్తరాంధ్ర ఆటాపాట నా గుండెల్లో అణువణువునా నింపేశారు. ఆయన వద్ద నటన కాదు.. ధైర్యంగా ఎలా ఉండాలో నేర్చుకున్నా. ఆయన నాకు జీవిత పాఠాలు నేర్పారు. చిన్నప్పటి నుంచి నాకు కోరికలు ఉండేవి కావు. అన్యాయం జరిగితే ఎదురుదాడి చేయాలని అనిపించేది. సినిమాలు చేయాలని, డబ్బులు సంపాదించాలని ఎప్పుడూ అనుకోలేదు. ఒక అభిప్రాయాన్ని చెప్పాలనుకున్నప్పుడు ధైర్యంగా చెప్పాలని సత్యానంద్ నేర్పించారు. అన్నయ్య, వదినలు నన్ను నమ్మారు. వాళ్లే నాకు కనిపించే దైవాలు. నటన కన్నా కూడా నాకు సినిమా మేకింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. నేను ఏ సినిమా చేసినా ఒక టెక్నీషియన్‌గా ఆలోచిస్తా. అందుకే నిజ జీవితంలో ఏం చేయగలనో అదే నా సినిమాల్లో చేస్తానని అన్నారు. మనం ఈ సినిమా గురించి మాట్లాడుకుంటున్నామంటే దర్శకుడు క్రిష్ కారణం. ఆయనే ఈ కథను తీర్చిదిద్దారు. అంతేకాదు, 20-30శాతం షూటింగ్ కూడా ఆయనే పూర్తి చేశారు. వ్యక్తిగత కారణాలతో ప్రాజెక్ట్ నుంచి తప్పుకొన్నా, జ్యోతికృష్ణ ఈ మూవీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. నేను చేయాల్సిన పని మాత్రమే చేస్తా. ఫలితం దేవుడికి వదిలేస్తా. గతంలో నియంతృత్వ పోకడలు కలిగిన వ్యక్తుల్ని ఎదుర్కొన్నామంటే అది మీరిచ్చిన ప్రోత్సహమే కారణం. ఫిల్మ్ మేకింగ్‌కు కుల, మతాలు లేవు. మేమంతా మీకు ఆనందం కలిగించడానికి ప్రయత్నం చేస్తాం. అలాంటి నేను ఈ సినిమా మేకింగ్ విషయంలో భయపడుతూ ఉండేవాడిని. ప్రేక్షకులను అలరిస్తుందా? అని అనుకునేవాడిని. కానీ, క్రిష్ టీజర్ విడుదల చేసి వాటిని పటాపంచలు చేశారని అన్నారు. ఆస్కార్ విన్నర్ ఎం.ఎం.కీరవాణి లేకపోతే, 'హరి హర వీరమల్లు' మూవీ లేదు. మేమెంత బాగా చేసినా, దానిని ముందుకు తీసుకెళ్లే నేపథ్య సంగీతం, పాటలు బాగోలేకపోతే మూవీ ఆకట్టు-కోదు. అకాడమీ అవార్డు విన్నర్ మనతో కలిసి ప్రచారం చేస్తున్నారంటే అది మన అదృష్టం. 'నాటు- నాటు-' యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిందంటే, అందుకు చంద్రబోస్ సాహిత్యం, కీరవాణి సంగీతం కారణం. 'ఖుషి' తర్వాత ఈ సినిమా పూర్తిగా చూశా. సినిమా ఎంటర్-టైన్ చేస్తే చాలని చాలా మంది అనుకుంటారు. కానీ, నా సినిమాలు ఎంటర్-టైన్‌తో పాటు- ఎడ్యుకేట్ చేయాలి. ప్రజా కంటకుడైన ఔరంగజేబు తీసుకెళ్లిపోయిన కోహినూర్ వజ్రాన్ని తీసుకురావడమే ఈ కథ. సనాతన ధర్మం అంటే, ఏ మతానికీ వ్యతిరేకం కాదు. అందరినీ కలిపేదని అన్నారు. మన చరిత్రలో ఎంతో మంది గొప్పరాజులు ఉన్నా, మొఘలుల గురించి ఎక్కువగా చెప్పారు. బలమైన శరీరంతో పాటు-, మనసు కూడా ఉండాలి. అందుకే మార్షల్ ఆర్ట్స్‌ను నమ్ముతాను. ఈ సినిమా ఘన విజయం సాధించాలని దేవుడిని ప్రార్థిస్తున్నా. పబ్లిసిటీ- లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్లడం అలవా-టైపోయింది. నా మొదటి సినిమా నుంచి ఏదో ఆడియో విడుదల వేడుక తప్పితే, 'రండి నా సినిమా చూడండి' అని ఎప్పుడూ అడగలేదు. నాకు ఇవ్వటమే తెలుసు కానీ, నేను అడగక్కర్లేదు. మీరు అన్నీ ఇస్తారని నాకు తెలుసు' అని పవన్‌కల్యాణ్ అన్నారు. అందరి హీరోల్లాగే తన మూవీకి టికెట్ రేట్లు- పెంచుకునేందుకు అవకాశం ఇచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు, ఈ మూవీ విజయం సాధించాలని పోస్ట్ చేసిన మంత్రి నారా లోకేశ్‌కు పవన్‌కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

# నేతల ఆర్థిక అవినీతికి చెక్ పెట్టేదెలా?

తెలుగు రాష్ట్రాల్లో అప్పులు చేసిన నేతలను తిడుతూ పోతున్న ప్రస్తుత సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు లు కూడా అప్పులనే ఆశ్రయిస్తున్నారు. అప్పులతోనే పాలన సాగిస్తున్నారు. ఆర్థిక నియంత్రణ లేకుండా పోతోంది. దుబారా ఖర్చులు విపరీతంగా ఉన్నాయి. వారి రక్షణకు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. దీనికి తోడు జీత భత్యాలు కూడా విపరీతమే. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతరలు జీతభత్యాలు కూడా లెక్కకు మిక్కిలి ఖర్చు చేస్తున్నారు. వీటిని తగ్గించే ప్రయత్నాలు లేవు. ఇక ఓట్ల కోసం ఉచిత పథకాలను కొనసాగిస్తున్నారు. ఇవన్నీ ఆలోచిన చేసి, ఖర్చులు తగ్గించుకోవాలన్న ప్రయత్నం జరగడం లేదు. ఇద్దరు సిఎంల ధోరణి ఇలాగే ఉంది. గతంలో పనిచేసిన కెసిఆర్, జగన్‌లు కూడా ఇంతకు మించి అన్నట్లు ప్రజాధనాన్ని దుబరా చేశారు. వేలకోట్లు వెనకేసుకున్నారు. నష్టపోతే పోయేది ప్రజలే అన్న ధోరణిలో పాలన సాగించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాల తీరు ఒక్కటిగానే ఉంది. ప్రభుత్వంలో ఉండగా అలానే ఉండేది. ఇద్దరి మనస్థత్వాలు ఒక్కటే అన్నది మెల్లగా ఇప్పుడు జనాలకు అర్థం అవుతోంది. అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించారు. నియంతృత్వ పోకడలతో ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టారు. నియంతల్లా పాలించారు. చరిత్రలో నియంతలను చూడకున్నా.. ఎలా ఉంటారో ఈ ఇద్దరినీ చూసిన వారికి అర్థం అయివుంటుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని నయా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, వ్యవస్థలను భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ఎదురుదాడి విమర్శలతో తప్పులను కప్పి పుచ్చుకునేందు తంటాలు పడుతున్నారు. అందుకే అధికార రుచి మరిగిన ఈ ఇద్దరూ ..మరోమారు అధికారంలో ఉండేలా పథకాల రచన చేసి రాష్ట్రాలను దోచేశారు. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. పథకాల పేరుతో నగదును దోచి పెట్టారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాల రూపకల్పనతో నగదు బదిలీలు చేశారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేసి సంపద సృష్టించామని గొప్పలు చెప్పారు. ప్యాలెస్‌లు కట్టుకున్నారు. సిఎం క్యాంప్ కార్యాలయం, సచివాలయం పేరుతో కెసిఆర్ దుబారాకు తెరలేపారు. కాళేశ్వరంతో రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ఇక జగన్ విశాఖలో రాజప్రాసాదాలు నిర్మించు కున్నారు. ఎల్లప్పుడూ తమదే అధికారం అని విర్రవీగారు. పేదవాడికి ఓ చిన్న ఇల్లుకు నానా తంటాలు పడ్డా, తమకు మాత్రం రాజప్రసాదాలు కావాలని భావించారు. ఇంతగా డబ్బును వినియోగించి, ప్రజల చెమటను విలాసాలకు ఉపయోగించేశారు. కరిమింగిన వెలగపండులా ఇప్పుడు పరిస్థితి అంతా డొల్లగా మారింది. ఇద్దరూ అధికారం కోల్పోయాక కానీ అసలు విషయం ప్రజలకు కూడా తెలియలేదు. ఎంతగా అంటే రాష్ట్రం కోలుకోలని విధంగా అప్పులు చేశారు. ఈ అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టిన రేవంత్, చంద్రబాబులు ఉచిత పథకాలను కొనసాగిస్తూనే ఉన్నారు. వ్యక్తిగత దుబారాను తగ్గించు కోవడం లేదు. హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇక అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీసిన బిఆర్ఎస్, వైకాపా నేతలు..మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిందన్న సామెతలా..చేసిన తప్పులన్నీ చేసి, ఇప్పుడేమో నానాయాగీ చేస్తున్నారు. ఎపిలో అక్రమాలు, అహింస రాజ్యమేలు తున్నాయని జగన్ గగ్గోలు పెడుతున్నారు. పోలీస్ అధికారులపై జులుం ప్రదర్శించడం కూడా జరిగి పోయాయి. పరామర్శల పేరుతో నానా హంగామా సృష్టించారు.తనకు విపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతున్నారని కూడా విమర్శలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా హుందాతనం ప్రదర్శించడంలో కెసిఆర్ ఆయన పరివారం, ఇటు జగన్ ఆయన పరివారం విఫలం అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థం అవుతోంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇంతగా ఎందుకు దిగజారిపోయారా అని అనుమానం కలుగుతోంది. ఎపిలో జగన్ అధికారంలో ఉండగా ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. బయటకు విమర్శలు చేస్తే....యూ ట్యూబర్లపైనా కేసులు పెట్టి వేధించిన ఘటనలు చూశాం. ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి వల్ల అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టి పోయింది. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారు. అధికార దుర్వినియోగం విపరీతంగా సాగింది. ప్రగతి భవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. అయినా ఆయనతో పాటు కొడుకు, అల్లుడి తీరులో మార్పు కనిపించడం లేదు. పాశ్చాత్తాపం కానరావడం లేదు.

బటన్లను నొక్కడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ నమ్మి అడ్డగోలు పనులు చేశారు. అందుకే జగన్‌ను జనం కసిగా ఓడించినా.. కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మవిమర్శల చేసుకోవడం లేదు. రోడ్డెక్కి నానా హంగామా చేయాలని చూస్తున్నారు. అందుకే ప్రజలతో పాటు, అణచివేతకు గురైన నేతలు తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం లేదు. చేసిన తప్పులను పక్కన పెట్టిన బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావు, కవితలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే పనిలో పడ్డారు. గత ఐదేళ్ల పాలనా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కెసిఆర్, జగన్‌లు తమ విధానాలు మార్చుకోవాలి. పాశ్చాత్తాపం ప్రకటించాలి. పాలకుల అవినీతిపై ఖచ్చితంగా విచారణ జరగాలి. శిక్షలు పడాలి. అందుకు ఇప్పుడున్న వ్యవస్థలో సాధ్యం కాదు.

# శేషప్రశ్నగా ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారం!

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే..అనూహ్యంగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం సహజంగానే ఆశ్చర్యాన్ని కలిగించడమే కాకుండా...అనుమానాలను రేకెత్తించింది. బెంగాల్ గవర్నర్‌గా ఆయన పనితీరును ప్రశంసించిన మోడీ అనూహ్యంగా ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. వెంకయ్యనాయుడు పదవీకాలం ముగియగానే పొడిగించమో లేదా..రాష్ట్రపతిగా ప్రమోషన్ ఇవ్వడమో జరుగుతుందని అంతా అనుకున్నారు. అయితే అవేవీ జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత అన్నీ అనూహ్యాలే జరుగుతున్నాయి. అద్వానీని రాష్ట్రపతిని చేస్తారని అంతా భావించారు. బిజెపి శ్రేణులు గట్టిగా నమ్మారు. కానీ రామ్‌నాథ్ కోవింద్‌ను తెరపైకి తెచ్చి అద్వానీని అవమానించారు. ఈ దేశానికి ప్రధాని కావాలని గట్టిగా నమ్మి పార్టీ కోసం కృషి చేసిన అద్వానీకి మోడీ అడ్డుపడ్డాడు. ఆతరవాత రాష్ట్రపతిని చేస్తారని అనుకుంటే...అప్పుడు కోవింద్ తెరపైకి వచ్చారు. ఇక అద్వానీ శకం ముగిసింది. మురళీమనోహర్ జోషి శకం ముగిసింది. పాతతరంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో ఉన్నారు. వెంకయ్యనాయుడును పార్టీ నుంచి తప్పించే క్రమంలో ఉపరాష్ట్రపతిని చేసి, ఆ తరవాత ఆయనను ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు ధన్‌ఖడ్ రాజీనామా కూడా అనూహ్యమే అయినా మోడీ వ్యూహం ఉండేవుంటుంది. పార్లమెంటు ప్రారంభంకావడం, తొలిరోజే అనూహ్యంగా విపక్షాలు వివిధ అంశాలపై చర్చకు పట్టుబట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్న ఉదయిస్తోంది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజీనామాను ఆమోదించారు. ఈ మేరకు ఫైల్‌పై సంతకం చేశారు. కాగా, గత రాత్రి అనూహ్యంగా జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. కానీ, ఈ రాజీనామాకు అసలు కారణం అనారోగ్యం కాదని పలువురు రాజకీయ నేతలు అంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయ న్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు- పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు.విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ

అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖఢ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది.

ఓ న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభించడం, కేంద్ర ప్రభుత్వంతో వివాదం, రాజ్యసభలో జరిగిన కొన్ని సంఘటనలు దన్‌కడ్ రాజీనామా వెనక ఉన్నాయని చెబుతున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ యశ్వంత్ వర్మ అనే న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభ్యం కావడంతో ఈ వివాదం మొదలైంది. ఈ సంఘటన తర్వాత విపక్ష పార్టీలు రాజ్యసభ లో జస్టిస్ వర్మను తొలగించేందుకు ఒక నోటీసును ప్రవేశపెట్టాయి. రాజ్యసభ అధ్యక్షుడిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ ఈ నోటీసును ఆమోదించి, రాజ్యసభ కార్యదర్శికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నచ్చలేదని తెలుస్తోంది. విపక్షాలు ప్రవేశపెట్టిన ఈ నోటీసును ఆమోదించడం ద్వారా, న్యాయవ్యవస్థలో అవినీతిపై కేంద్రం నేరుగా చర్యలు తీసుకునే అవకాశాన్ని ధన్‌ఖర్ తప్పించారని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ విషయంపై కేంద్రంతో విభేదాలు వచ్చాయని పుకార్లు కూడా వచ్చాయి. ఈ సంఘటన తర్వాత ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయని తెలిసింది. ఆరు నెలల క్రితం కూడా విపక్షాలు ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. అయితే, ఈసారి కేంద్రం నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా, ధన్‌ఖర్ అవమానకరమైన అవిశ్వాస తీర్మానానికి బదులు రాజీనామా చేయడాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం రాత్రి 9:25 గంటలకు ఉప రాష్ట్రపతి అధికారిక ఎక్స్ ఖాతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖను పోస్ట్ చేశారు. తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు- లేఖలో తెలిపారు. ఇది వెంటనే అమల్లోకి వచ్చేలా భారత ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో తన పదవీ కాలంలో సహకరించిన వారికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, ప్రధానమంత్రి, రాజ్యసభ సభ్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇవన్నీ బయటకు కనిపిస్తున్న కారణాలే అయినా ఇంకా ఇతరత్రా ఏ కారణాలు ఉన్నాయన్నది కాలక్రమంలో తెలుస్తుంది. అయితే ధన్‌ఖడ్ మోడీకి ఇష్టమైన వ్యక్తిగా అనూహ్యంగా దూసుకుని వచ్చి..అంతే అనూహ్యంగా రాజీనామా చేసి వెళ్లిపోవడమనే చర్య మాత్రం అనుమానాలను రేకెత్తిస్తూనే ఉంటుంది.



# ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ చర్చ



**అనూహ్య రాజీనామాకు కారణాలపై ఆరా**

**లోతైన కారణాలు ఉంటాయని జైరామ్ రమేశ్ అనుమానం**

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఎవరికి తోచిన విధంగా వారు విశ్లేషణలు చేస్తున్నారు. ఇంత సడన్‌గా ఎందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నారని ఆరా తీస్తున్నారు. ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామాపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. అనారోగ్య కారణాలతో వైదొలుగుతున్నట్లు ఆయన చెప్పినప్పటికీ.. అది కారణం కాకపోవచ్చని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ధన్‌ఖడ్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బిజినెస్ అడ్వైజరీ కమిటీకి అధ్యక్షత వహించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజుతో సహా పలువురు దీనికి హాజరయ్యారు. చర్చ అనంతరం సాయంత్రం 4.30కు మళ్లీ సమావేశం కావాలని

నిర్ణయించుకున్నారు. అయితే, మరోసారి భేటీకి రిజిజు, నడ్డా రాలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ధన్‌ఖడ్ మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దీన్ని బట్టి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4.30 మధ్య ఏదో పెద్ద విషయమే జరిగిందని జైరామ్ రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు.

రిజిజు, నడ్డా ఉద్దేశపూర్వకంగానే సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈక్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖఢ్ ప్రకటించారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా ఇలా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాన్ని మనం గౌరవించాలి. కానీ, అందుకు చాలా లోతైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోందని రమేశ్ రాసుకొచ్చారు. తన పదవీకాలంలో రైతుల సంక్షేమంపై ధన్‌ఖఢ్ నిర్భయంగా మాట్లాడేవారని రమేశ్ పేర్కొన్నారు. ప్రజాజీవితంలో న్యాయపరమైన జవాబుదారీతనం, సంయమనం గురించి గట్టిగా మాట్లాడారన్నారు. ఆయన నిబంధనలు, ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉన్నారన్నారు. సోమవారం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైన సంగతి తెలిసిందే. తొలి రోజు కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖఢ్ రాత్రి అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. ఈ క్రమంలోనే ఆయన వైదొలగాలని నిర్ణయించుకోవడం అనుమానాలను కలిగిస్తోంది. ధన్‌ఖడ్ రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ- ఛైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించనున్నారు. ఉదయం నుంచి ఎగువసభను సజావుగా నడిపించిన ఆయన రాత్రికి తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. దీంతో ఆయన రాజీనామాపై ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది. అనారోగ్య కారణాలతో పదవి నుంచి దిగిపోతున్నట్లు- ధన్‌ఖడ్ చెప్పినప్పటికీ.. ఆయన రాజీనామాపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్య కారణాలతోనే పదవి నుంచి దిగిపోతున్నట్లు- చెప్పారని.. దాన్ని మనం గౌరవించాలని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా ఆయన రాజీనామా వెనుక ఏదో లోతైన కారణాలే ఉందని అనుమానం వ్యక్తం చేశారు.



## పండ్ల తోటల లక్ష్యాలను పూర్తి చేయండి: ఏపీఓ రామన్న

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జూలై 23**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం చేపడుతున్న రైతులకు ప్రతినెల బిల్లులు చెల్లించాలని ఏపీఓ రామన్న టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం సి.బెళగల్ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు ఉపాధి హామీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ 18వ సామాజిక తనిఖీలో రికవరీ మరియు జరిమానా కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లుకు తమ గ్రామాలనికి చెందిన జరిమానాలను చెల్లించాలని, అలాగే సామాజిక తనిఖీ ఫైళ్లను భద్రపరచాలని తెలిపారు. అలాగే ఏప్రిల్ నుండి జూలై నెల వరకు జరిగిన ఉపాధి హామీ ఫైళ్లను, ఫోటోలను సరిచూసుకొని భద్రపరచుకోవాలని, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పండ్లతోటలు వేసుకున్న రైతులకు ప్రతినెల మెయింటెనెన్స్ బిల్లులు చెల్లించాలని టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేఈ రంగస్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ఎడారిలో ఒయాసిస్సు..దుబాయ్ అభివృద్ధి

విజయవాడ: సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుంటేనే అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఆర్థిక సంస్కరణలు, 1995లో టెక్నాలజీ రివల్యూషన్‌తో పరిస్థితి మారిందని తెలిపారు. ఏడారి నుంచి స్వర్గాన్ని సృష్టించిన దేశం దుబాయ్ అని కొనియాడారు. సరికొత్త ఆలోచనలతోనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమని నొక్కిచెప్పారు. వికసిత్ భారత్‌తో 2047 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని వ్యాఖ్యానించారు. ఏపీలో 2026 జనవరి నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు- చేస్తామని ప్రకటించారు. యూఏఈ అభివృద్ధిలో భారత్ భాగస్వామ్యం హర్షణీయమని అన్నారు. ఇదే సందర్భంలో దుబాయ్‌ను చూస్తుంటే తనకు అసూయ వేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దుబాయ్‌లో ఎడారి ప్రాంతాలు, బీచ్‌లు పర్యాటకులకు ఆహ్లాదకర అనుభూతిని కలిగిస్తాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎడారి నుంచి స్వర్గాన్ని సృష్టించిన దేశం దుబాయ్ అని, పట్టుదలకు అది నిదర్శనంగా నిలిచిందని అన్నారు. విజయవాడలో నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ సదస్సుకు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'దుబాయ్‌లో ఎడారి ప్రాంతాలు, బీచ్‌లు పర్యాటకులకు ఆహ్లాదకర అనుభూతిని కలిగిస్తాయి. యూఏఈ అభివృద్ధిలో భారత్ భాగస్వామ్యం ఉండటం సంతోషకరం అన్నారు.

సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుంటేనే అభివృద్ధి సాధ్యం. నూతనంగా ఆలోచించడం వల్లే కొత్త ఆవిష్కరణలు పుట్టు-కొస్తున్నాయి. యూఏఈతో భారత్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి.ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారత్‌కు అపార అవకాశాలు వచ్చాయి. ఉమ్మడి ఏపీలో విజన్ 2020 రూపొందించి రాష్ట్రాభివృద్ధి మెరుగుపరిచాం. రాష్ట్రంలో 2026 జనవరి నాటికి క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు- చేస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 575 సేవలు అందిస్తున్నాం. ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండదన్నారు. ఆగస్టు 15 నాటికి అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి తీసుకొస్తున్నాం. మెరుగైన సాంకేతికతతో అద్భుతాలు సృష్టించే కాలమిది. ఆరోగ్యం, సంపద, సంతోషకర సమాజ స్థాపనే మా లక్ష్యం. ప్రభుత్వం, ప్రైవేటు- భాగస్వామ్యంతో రహదారుల వంటి అన్ని పనులు చేస్తున్నాం అని తెలిపారు. కొత్తగా పీ4 విధానం తీసుకొస్తున్నాం.. పబ్లిక్, ప్రైవేటు-, పీపుల్ పార్టనర్‌షిప్.

## నేతల ఆర్థిక అవినీతికి చెక్ పెట్టేదెలా?

తెలుగు రాష్ట్రాల్లో అప్పులు చేసిన నేతలను తిడుతూ పోతున్న ప్రస్తుత సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు లు కూడా అప్పులనే ఆశ్రయిస్తున్నారు. అప్పులతోనే పాలన సాగిస్తున్నారు. ఆర్థిక నియంత్రణ లేకుండా పోతోంది. దుబారా ఖర్చులు విపరీతంగా ఉన్నాయి. వారి రక్షణకు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. దీనికి తోడు జీత భత్యాలు కూడా విపరీతమే. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతరలు జీతభత్యాలు కూడా లెక్కకు మిక్కిలి ఖర్చు చేస్తున్నారు. వీటిని తగ్గించే ప్రయత్నాలు లేవు. ఇక ఓట్ల కోసం ఉచిత పథకాలను కొనసాగిస్తున్నారు. ఇవన్నీ ఆలోచిన చేసి, ఖర్చులు తగ్గించుకోవాలన్న ప్రయత్నం జరగడం లేదు. ఇద్దరు సిఎంల ధోరణి ఇలాగే ఉంది. గతంలో పనిచేసిన కెసిఆర్, జగన్‌లు కూడా ఇంతకు మించి అన్నట్లు ప్రజాధనాన్ని దుబరా చేశారు. వేలకోట్లు వెనకేసుకున్నారు. నష్టపోతే పోయేది ప్రజలే అన్న ధోరణిలో పాలన సాగించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు విపక్షంలో ఉన్న బిఆర్‌ఎస్, వైకాపాల తీరు ఒక్కటిగానే ఉంది. ప్రభుత్వంలో ఉండగా అలానే ఉండేది. ఇద్దరి మనస్థత్వాలు ఒక్కటే అన్నది మెల్లగా ఇప్పుడు జనాలకు అర్థం అవుతోంది. అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించారు. నియంతృత్వ పోకడలతో ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టారు. నియంతల్లా పాలించారు. చరిత్రలో నియంతలను చూడకున్నా.. ఎలా ఉంటారో ఈ ఇద్దరినీ చూసిన వారికి అర్థం అయివుంటుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని నయా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, వ్యవస్థలను భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ఎదురుదాడి విమర్శలతో తప్పులను కప్పి పుచ్చుకునేందు తంటాలు పడుతున్నారు. అందుకే అధికార రుచి మరిగిన ఈ ఇద్దరూ ..మరోమారు అధికారంలో ఉండేలా పథకాల రచన చేసి రాష్ట్రాలను దోచేశారు. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. పథకాల పేరుతో నగదును దోచి పెట్టారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాల రూపకల్పనతో నగదు బదిలీలు చేశారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేసి సంపద సృష్టించామని గొప్పలు చెప్పారు. ప్యాలెస్‌లు కట్టుకున్నారు. సిఎం క్యాంప్ కార్యాలయం, సచివాలయం పేరుతో కెసిఆర్ దుబారాకు తెరలేపారు. కాళేశ్వరంతో రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ఇక జగన్ విశాఖలో రాజప్రాసాదాలు నిర్మించు కున్నారు. ఎల్లప్పుడూ తమదే అధికారం అని విర్రవీగారు. పేదవాడికి ఓ చిన్న ఇల్లుకు నానా తంటాలు పడ్డా, తమకు మాత్రం రాజప్రసాదాలు కావాలని భావించారు. ఇంతగా డబ్బును వినియోగించి, ప్రజల చెమటను విలాసాలకు ఉపయోగించేశారు. కరిమింగిన వెలగపండులా ఇప్పుడు పరిస్థితి అంతా డొల్లగా మారింది. ఇద్దరూ అధికారం కోల్పోయాక కానీ అసలు విషయం ప్రజలకు కూడా తెలియలేదు. ఎంతగా అంటే రాష్ట్రం కోలుకోలని విధంగా అప్పులు చేశారు. ఈ అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టిన రేవంత్, చంద్రబాబులు ఉచిత పథకాలను కొనసాగిస్తూనే ఉన్నారు. వ్యక్తిగత దుబారాను తగ్గించు కోవడం లేదు. హెలికప్టర్లు, ప్రత్యేక విమానాల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇక అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీసిన బిఆర్‌ఎస్, వైకాపా నేతలు..మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిందన్న సామెతలా..చేసిన తప్పులన్నీ చేసి, ఇప్పుడేమో నానాయాగీ చేస్తున్నారు. ఎపిలో అక్రమాలు, అహింస రాజ్యమేలు తున్నాయని జగన్ గగ్గోలు పెడుతున్నారు. పోలీస్ అధికారులపై జులుం ప్రదర్శించడం కూడా జరిగి పోయాయి. పరామర్శల పేరుతో నానా హంగామా సృష్టించారు.తనకు విపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతున్నారని కూడా విమర్శలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా హుందాతనం ప్రదర్శించడంలో కెసిఆర్ ఆయన పరివారం, ఇటు జగన్ ఆయన పరివారం విఫలం అయ్యారు. రెండు

తెలుగు రాష్ట్రాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థం అవుతోంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇంతగా ఎందుకు దిగజారిపోయారా అని అనుమానం కలుగుతోంది. ఎపిలో జగన్ అధికారంలో ఉండగా ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. బయటకు విమర్శలు చేస్తే....యూ ట్యూబర్లపైనా కేసులు పెట్టి వేధించిన ఘటనలు చూశాం. ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి వల్ల అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టి పోయింది. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారు. అధికార దుర్వినియోగం విపరీతంగా సాగింది. ప్రగతి భవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. అయినా ఆయనతో పాటు కొడుకు, అల్లుడి తీరులో మార్పు కనిపించడం లేదు. పాశ్చాత్తాపం కానరావడం లేదు. బటన్లను నొక్కడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ నమ్మి అడ్డగోలు పనులు చేశారు. అందుకే జగన్‌ను జనం కసిగా ఓడించినా.. కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మవిమర్శల చేసుకోవడం లేదు. రోడ్డెక్కి నానా హంగామా చేయాలని చూస్తున్నారు. అందుకే ప్రజలతో పాటు, అణచివేతకు గురైన నేతలు తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం లేదు. చేసిన తప్పులను పక్కన పెట్టిన బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావు, కవితలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే పనిలో పడ్డారు. గత ఐదేళ్ల పాలనా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కెసిఆర్, జగన్‌లు తమ విధానాలు మార్చుకోవాలి. పాశ్చాత్తాపం ప్రకటించాలి. పాలకుల అవినీతిపై ఖచ్చితంగా విచారణ జరగాలి. శిక్షలు పడాలి. అందుకు ఇప్పుడున్న వ్యవస్థలో సాధ్యం కాదు. లోక్‌పాల్ వంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తేనే పాలకుల అవినీతిని అరికట్టగలం. అక్కడే సమగ్ర విచారణ జరగగలదు. ఈ విషయంలో ప్రజలంతా లోక్‌పాల్ కోసం ఉద్యమించాలి. రాజకీయ అవినీతిపై ప్రజలే యుద్ధం చేయాలి.

## ఉపరాష్ట్రపతి రాజీనామాపై తొలగని ఉత్కంఠ

న్యూఢిల్లీ:ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై అనుమాలను వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఆయన రాజీనామా వెనక లోతైన కారణం ఉంటుందని కాంగ్రెస్ ఆరోపిస్తుంది. అధికార బిజెపి మాత్రం ఎలాంటి వ్ఆయఖ్యలు చేయడం లేదు. అలాగే ధన్‌ఖడ్ కూడా తన రాజీనామాపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. మొత్తానికి ఈ సస్పెన్స్ ఇప్పట్లో తెరపడేలా లేదు. ఇదిలావుంటే అనూహ్యంగా ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ తన రాజీనామాకు ముందు ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండా రాష్ట్రపతి కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. సోమవారం రాత్రి ఆయన రాష్ట్రపతి భవన్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది.సోమవారం రాత్రి 9 గంటలకు ధన్‌ఖడ్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ- అయ్యారని.. తన రాజీనామా లేఖను అందించారని సమాచారం. అరగంట తర్వాత తన రాజీనామా లేఖను 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. అయితే.. ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండా

ఆయన రాష్ట్రపతి భవన్‌ను సందర్శించడం పలువురిని ఆశ్చర్యపరిచింది.ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండా రాష్ట్రపతి కార్యాలయానికి ధన్‌ఖడ్ రావడంపై రాష్ట్రపతి కార్యాలయ సిబ్బంది మొదట గందర గోళానికి గురైనట్లు- పలు మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. రాష్ట్రపతి భవన్‌ను సందర్శించే వారి షెడ్యూల్ చాలా రోజుల ముందుగానే సిద్ధమవుతుంది. అయితే.. ఒక సీనియర్ రాజ్యంగ నేత ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకుండా రాష్ట్రపతి భవన్‌లో కనిపించడం ఇటీవల ఇదే తొలిసారి కావొచ్చని పలువురు పేర్కొంటు-న్నారు. ఇక ధన్‌ఖడ్ రాకతో వెంటనే అప్రమత్తమైన రాష్ట్రపతి భవన్ సిబ్బంది..చివరి నిమిషంలో వీరి భేటీకి అన్ని ఏర్పాట్లు- చేసినట్లు- సమాచారం. ఇక ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన రాజీనామాను మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సంతకంతో కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ధన్‌ఖడ్ రాజీనామాతో కొత్త ఉప రాష్ట్రపతి వచ్చేవరకు ఇక రాజ్యసభను డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్ నడపనున్నారు. ఈ క్రమంలో ఉప రాష్ట్రపతి ఎన్నిక పక్రియ ప్రారంభమైంది. ఎన్నిక నిర్వహించడానికి ఈసీ సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా లోక్‌సభ, రాజ్యసభలోని ఎలక్టోరల్ కాలేజీ ఎంపీలను సంప్రదిస్తోంది. రిటర్నింగ్ ఆఫీసర్ల పేర్లను ఖరారు చేసేందుకు చర్యలు చేపట్టింది.ఉప రాష్ట్రపతి పదవికి జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో.. తదుపరి ఆ పదవిని చేపట్టబోయే వారు ఎవరనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు కొత్త ఉప రాష్ట్రపతి ఎన్నిక పక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు- తెలుస్తోంది. ఎన్నికల పక్రియను కేంద్ర ఎన్నికల సంఘం మరో 24 గంటల్లోపే ప్రారంభించే అవకాశం ఉన్నట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కొత్త ఉప రాష్ట్రపతి ఎన్నిక పక్రియ నెల రోజుల్లో పూర్తవుతుందని పార్లమెంట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఖాళీగా ఉన్న ఉప రాష్ట్రపతి పదవిని సాధ్యమైనంత త్వరలో భర్తీ చేస్తామని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే.. రాజ్యాంగ నిబంధనల్లో నిర్దిష్ట కాలపరిమితి గురించి ప్రస్తావన లేదు. ఇక ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన తర్వాత ఆయనకు దిల్లీలోని లుటియన్స్‌లోని ప్రభుత్వ బంగ్లాను కేటాయిస్తారని సమాచారం. ఇక ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రకారం ఆయనకు భద్రత కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. పార్లమెంటు ఉభయ సభల్లోని సభ్యులు ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు పార్లమెంటు-లో ఎన్డీయేకు స్పష్టమైన మెజారిటీ- ఉంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతోపాటు రాజ్యసభలో నామినేటెడ్ సభ్యులకూ ఓటుహక్కు ఉంటుంది. లోక్‌సభలో ప్రస్తుతం 542 మంది సభ్యులు ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బసీర్‌హాట్ సీటు ఖాళీగా ఉంది. రాజ్యసభలో 240 మంది ఉన్నారు. 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. నలుగురు నామినేటెడ్ సభ్యులతో కలిపి ఉభయసభల మొత్తం సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మొత్తంగా 422 మంది సభ్యులు ఎన్డీయేకు అనుకూలంగా ఉన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# శ్రేష్ఠమైన సంతానంతో సమాజాన్ని నిర్మిద్దాం..మంగవల్లి




**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జూలై23**

- గర్భిణీలకు మొదటి..మూడు నెలలు కీలకం.. మంగవల్లి
- వ్యాయామం ద్వారా పిండం ఆరోగ్యం
- గర్భ వ్యవస్థ జీవనశైలి మార్పుపై అవగాహన
- హాజరైన అంగన్వాడీలు.. గర్భిణీలు

గర్భం దాల్చిన ప్రతి మహిళలకు మొదటి మూడు నెలలు చాలా కీలకమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి మంగవల్లి గర్భిణీ స్త్రీలకు సూచించారు. బుధవారం స్థానిక వాసవి భవనంలో ఆర్య జనని స్వామి వివేకానంద భావాల స్ఫూర్తితో రామకృష్ణ మఠం వారి సౌజన్యంతో గర్భిణీ స్త్రీలకు శిశు జననం కోసం పాటించవలసిన ఆరోగ్య సూత్రాలు మరియు గర్భ వ్యవస్థ జీవనశైలి మార్పుపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్లినికల్ సైకాలజిస్ట్ వృశాలి మాట్లాడుతూ శ్రేష్టమైన సంతానంతో సర్వ శ్రేష్ట సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు .స్త్రీలు గర్భం దాల్చిన నుంచి ప్రసవం జరిగే వరకు ఏ విధంగా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి ,వ్యాయామం చేయాలి, ఎటువంటి పనులు చేయాలి, మానసిక ఒత్తిడి ఏ విధంగా అధిగమించాలి తదితర వాటిపై అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు వ్యాయామం మరియు పౌష్టికాహారం తీసుకుంటే పిండం ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ డబ్బాలు( డ్రై ఫ్రూట్స్ ) అందజేశారు. గర్భిణీ స్త్రీల

సమావేశానికి హాజరైన వారికి నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజన వసతి కల్పించారు .ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నిహారిక, యోగా నిపుణులు మాధవి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దశరథ, ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం. మనోహర్ ఐసీడీఎస్ సూపర్వైజర్లు బొగ్గుల ఆశీర్వాదమ్మ, అనురాధ, వేమారెడ్డి రేణుక, వెంకటేశ్వరమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు , గర్భిణీ స్త్రీలు తదితరులు

# సిపిఐ పార్టీ 24 జిల్లా మహాసభలను జయప్రదం చేయండి -సిపిఐ

## .గోడ పత్రికలను విడుదల చేసిన సిపిఐ నాయకులు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




గోనెగండ్ల: జులై 23 బుధవారం -సిపిఐ పార్టీ24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు వి.మద్దిలేటి నాయుడు, తాలుకా రైతు నాయకులు కటికే మాలిక్, సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి కె.శ్రీరాములు,మండల సహాయ కార్యదర్శి శివరామంజిని,లు పిలుపునిచ్చారు.బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్ల లో సిపిఐ పార్టీ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు గోడ పత్రికలు విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ)1925 డిసెంబర్ 26న ఆవిర్భవించింది.ఆగష్టు 9,10,11,వ తేదీలలో కర్నూలు నగరంలో జరుగు కర్నూలు జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు.సిపిఐ పార్టీ ఆవిర్భవించినప్పటి అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో కటీకే బడేసావలి, మద్దిలేటి,లింగమ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జూలై 23**




కంది, మిరప, ఉల్లి, వరి పండించే రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం సి. బెలగల్ మండలం ఇనగండ్ల, సంగాల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలోనీ పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా కంది పంటకు ఎకరంకు 44 రూపాయలు, మిరపకు 360 రూపాయలు, వరి పంటకు 80 రూపాయలు, ఉల్లి పంటకు 90 రూపాయలు చెల్లించి ఈనెల చివరిలోపు పంటలకు బీమా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఏ సునీత, ఎంపీఈఓలు వెంకటేశ్వర్లు, ఈశ్వర్ ఆయా గ్రామాల్లోని రైతులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం:

**నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య.**

**ఉత్తేజిత ప్రతినిధి...నందికొట్కూరు : జులై 23**



పేద వర్గాల సంక్షేమం, రాష్ట్ర అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.బుధవారం జూపాడు బంగ్లా మండలం కాశానగర్ కాలనీ "సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు.పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఏడాది కూటమి పాలనలో అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని తీసుకెలన్నదే చంద్రబాబు సంకల్పమన్నారు. రాష్ట్రం మెరుగైన పాలన వైపు ముందడుగు వేస్తోందన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వాటిని పరిష్కరించడానికి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దే క్రమంలో విప్లవాత్మ కమైన మార్పులు తీసుకొస్తామన్నారు. దేశానికి తలమానికంగా నిలిచేలా సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం రైతులతో గ్రామ ప్రజలతో ముఖాముఖి రచ్చబండ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూపాడుబంగ్లా మండలానికి ఒక డ్రోను రూ. 9.8 లక్షలలాగా (7.5 లక్షల సబ్సిడి) రైతులకు అందించామన్నారు. అలాగే రూ. 2.50 కోట్లతో మండలం లోని వివిధ గ్రామాలలో 36 సిసి రహదారులను వేయడం జరిగిందన్నారు. మండలం లో పాడి రైతులకు 50 మినీ గోకులములు నిర్మించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రజల రహదారుల సౌకర్యం కొరకు సీసీ రోడ్లు నిర్మించాము. అలాగే రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేశాము. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే దిశగా డ్రోన్ లు ఇస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమం లో సర్పంచ్ బాలయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీఓ గోపి కృష్ణ, నందికొట్కూరు వ్యవసాయ కమిటీ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ నాయకులు గిరీష్ రెడ్డి, మోహన్ రెడ్డి, కాతా రమేష్ రెడ్డి,



డీసీసీ చైర్మన్ పరమేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్, ఎస్సీ ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు లింగాల నాగరాజు, టీడీపీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ప్రసన్న లక్ష్మి, రవి యాదవ్, రవికాంత్, జంగాల పెద్దన్న, రమణా రెడ్డి, రాంమోహన్ రెడ్డి, శాలు బాష, లక్ష్మన్న గౌడ్, దేవసహాయం, ఎమ్మార్పియస్ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్ బాల్ క్రీడాకారులకు YSRCP నాయకులు పాల శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో షూస్ పంపిణీ కార్యక్రమము జరిగింది

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు జులై 23 బుధవారం పాల శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఎమ్మిగనూరు వారు ఈరోజు ఉదయం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నందు, ఎమ్మిగనూరు ఫుట్ బాల్ క్రీడాకారులకు 15 జతల ఫుట్ బాల్ షూస్ ఫుట్ బాల్ క్రీడాకారులకు అందజేయడం జరిగింది.ఈ సహాయ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కె.ఆర్ శ్రీనాథ్ రెడ్డి అధ్యక్షులు, ఏ సుధాకర్ రావు, ప్రధాన కార్యదర్శి,మాచాని నాగరాజు,కోశాధికారి,కేర్ నటరాజ రెడ్డి, ఆర్గనైజర్,కె ఆర్ నరసింహారెడ్డి,కురువ బీరప్ప,మాచాని వెంకటేష్,బైలుప్పల షఫీయుల్లా,మల్లారి సోమశేఖర్, ఎమ్మిగనూర్ ఫుట్బాల్ క్రీడాకారుల ప్రతినిధి ఎస్ షేక్షావలి, రవిచంద్ర పాల్గొని ఫుట్బాల్ క్రీడాకారులకు ఫుట్బాల్ షూస్ ను అందజేయడం జరిగింది. రోటరీ క్లబ్ వారు చేస్తున్న సహాయ సహకారాలకు ది ఎమ్మిగనూర్ ఫుట్బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.....

# మా బి ,వి ,కు మంత్రి పదవి ఇవ్వాలి పట్టణ తెలుగుదేశం

**నాయకులు నవాజ్ ఎమ్మిగనూరు**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు జులై 23 బుధవారం

నియోజకవర్గానికి2024 సాధారణ ఎన్నికల్లో ఎమ్మిగనూరు నుండి రెండవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి కు మంత్రి పదవి ఇవ్వాలని పట్టణ తెలుగుదేశం నాయకులు నవాజ్ విజ్ఞప్తి చేశారు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక సంవత్సరంలోనే మా ఎమ్మిగనూరు నియోజకవర్గానికి ఎంతో అభివృద్ధి బాటలో నడిపిస్తూ అదే తరహాలో మా కర్నూలు జిల్లా అను రాష్ట్రంను అభివృద్ధి చేసి చూపిస్తారన్న నమ్మకం మాకు ఉందని ఆయన అన్నారు ఎందుకంటే మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి గారి ఆశయాలను ముందుకు తీసుకొని పోతున్న ఆయన తనయుడు బివి జయ నాగేశ్వరరెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పనిచేస్తున్నాడు గత ఐదు ఏళ్ళు వైసిపి రాచకలను దౌర్జాలను ఎదిరించి టిడిపి నాయకులకు ప్రజల ప్రజలకు అండగా ఉంటూ వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక విచ్చలవిడిగా కోట్లు ఖర్చు చేసింది అయినప్పటికీ బీవీ కుటుంబం పై ఉన్న అభిమానాన్ని అడ్డు కో లేకపోయారు బివి కుటుంబం పై నమ్మకం ఉంచి సీటు ఇచ్చారు అదే నమ్మకంతో మంత్రి పదవి ఇచ్చి బివి కుటుంబాన్ని వచ్చేనెల మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి విచి గౌరవించాలని నవాజ్ కోరారు ఎందుకంటే పార్టీని బివి మోహన్ రెడ్డి ఎంత నమ్మకంగా పనిచేశారు అదేతరాలోనే బివి జై నాగేశ్వర్ రెడ్డి మీ నమ్మకాన్ని వమ్ము చేయరని పార్టీ మరియు పార్టీ సిద్ధాంతాలు ఎప్పటికప్పుడు ప్రజల దగ్గరకుతీసుకుని పోయే తీసుకుని పోయే జిల్లాలో ఏకైక నాయకుడు మా ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరుడని నవాజ్ అన్నారు ఎందుకంటే పార్టీ మరియు నాయకత్వాన్ని విధేయుడిగా ఉంటున్న మా బి వి జయ నాగేశ్వర్ రెడ్డి గారిని మంత్రి పదవి ఇచ్చి బి.వి కుటుంబాన్ని గౌరవించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి మరియు నారా లోకేష్ గారికి ఎమ్మిగనూరు నియోజవర్గ ప్రజలు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కోరుకుంటున్నామని నవాజ్ అన్నారు మా ఎమ్మెల్యే గారికి మంత్రి పదవి ఇచ్చి ఎమ్మిగనూరు నియోజవర్గం ప్రజల కోరికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరుస్తానన్న ఆశతో ఉన్నామని నవాజ్ ఆశాభవం వ్యక్తం చేశారు

# ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి టిడిపి తోనే సాధ్యం

**బేతంచర్ల : ఉత్తేజిత ప్రతినిధి :**



ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యం అని టీడీపీ సీనియర్ నాయకులు పోలురు శ్రీనివాసరెడ్డి,అన్నారు.బేతంచెర్ల మండల పరిధిలోని బలపాలపల్లె,పాపసాని కొట్టాల,గ్రామలలోని 226,227,భూత్ లలో పోలురుశ్రీనివాసరెడ్డి, ఆధ్వర్యంలో సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సూపర్ 6 పథకాలు హామీ ఇచ్చిందని,అందులో తల్లికి వందనం,ఫ్రీగ్యాస్,మెగా డీఎస్సీ మొదలగు పథకాలు అందజేసిందిని,త్వరలో పూర్తిస్థాయి లో పథకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలకు అందజేస్తుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమం బూత్ కన్వీనర్లు భాస్కర్,రాచపోగుల ఈశ్వరయ్య,గురునాథ్,మద్దిలేటి,సుదర్శన్ రెడ్డి, శేఖర్,శివన్న,పౌలయ్య,మద్దిలేటి స్వామి, సుధాకర్,మధు శేఖర్,కోటయ్య,సోల్మన్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాలో జింకల సమస్యను అరికట్టి రైతుల పంట పొలాలను కాపాడాలి.

**సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు : జులై 23 బుధవారం

కర్నూలు జిల్లాలో జింకల బెడద వలన రైతులను కాపాడాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు . బుధవారం ఎమ్మిగనూరులో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగినది. ఈ సందర్భంగా జి. రామకృష్ణ మాట్లాడుతూ రైతులు పంటలు లేక ఇబ్బంది పడుతుంటే వర్షాలు ఎప్పుబడతాయని ఎదురుచూస్తుండగా వేసిన విత్తనాలను జింకలు వేసుకోవడం వలన పెట్టిన పెట్టుబడి కోల్పోయి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు 2014 సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవరగట్ట దగ్గర జింకల పార్కు ఏర్పాటు చేస్తారని హామీ ఇచ్చాడు హామీ హామీ హామీ గానే మాత్రమే మిగిలినది తప్ప ఇంతవరకు పరిష్కారం కాలేదు అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు మంత్రాలయం దగ్గర పెడతానని చెప్పాడు అధికారంలోకి వచ్చిన నాయకులు వాగ్దానాలు చేయడం తప్ప రైతుల సమస్యల పరిష్కారం చేయలేమనడానికి ఏదో ఒక చక్కని నిదర్శనం రైతులు రాత్రింబవళ్లు నిద్రలు మేల్కోవాల్సింది వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేవు పంటలేవ్ వేసిన విత్తనాన్ని మొలకెత్తిన వెంటనే జింకలు మేసి వేస్తున్నాయని అరికట్టడానికి ఫారెస్ట్ అధికారులు జిల్లా అధికారులు జోక్యం చేసుకొని రైతుల బంట పొలాల బారిన పడకుండా చర్యలు తీసుకొని రైతులను కాపాడాలని కోరారు.

అట్లాగే యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని జిల్లాలో ఇప్పుడిప్పుడే వర్షాలు పడుతున్న తరుణంలో యూరియా కొరత వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు కాబట్టి ప్రభుత్వం వెంటనే యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి. డీఏపీ యూరియా ఈ కావాలంటే మరొక కాంప్లెక్స్ తీసుకోవాలని అటువంటి ఒత్తిడి రైతుల పైన చేయకూడదని అవసరంలేని ఎరువులను అంటగట్టి రైతులను నష్టపోయేటట్లు చేయవద్దని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సి హనుమంతు పి హనుమంతు కే మల్లయ్య జిల్లా సహాయ కార్యదర్శిలు కోటకొండ సూరి ఏ కృష్ణ జిల్లా నాయకులు హెూల గుండవెంకటేశ్వర్లు ఎమ్మిగనూరు లక్మి నరసయ్య జి ఆంజనేయులు, నరసింహులు అయ్యప్ప మధు రెడ్డి బడే సాబ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ మాచాని సోమప్ప గుర్తింపు తొలగిపోతావుంది.

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు**



పద్మశ్రీ మాచాని సోమప్ప ఎమ్మిగనూరు జులై 23 బుధవారం పితామహుడు అని అనడంలో ఎమ్మిగనూరు ప్రజల్లో సందేహం లేదు. ఎమ్మిగనూరు కుగ్రామంగా ఉన్న స్థాయినుండి జాతీయ స్థాయిలో వరకు గుర్తింపు తెచ్చిన మహానుభావుడు ఆయన. ఆయన మరణానంతరం ఆయన విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయగా అది సోమప్ప సర్కిల్ గా గత ఏభై ఏళ్ళ గా ప్రసిద్ధి చెందింది. ఈ సర్కిల్ లో వంద అడుగుల స్తంభం కలిగిన జాతీయ జెండా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మునిసిపాలిటీ నిర్ణయించింది. ఈ కారణంగా ప్రస్తుతం మాచాని సోమప్ప సర్కిల్ గా పేరున్న సర్కిల్ కాలక్రమేణా జెండా సర్కిల్ గా గుర్తింపు కలిగి తీరుతుంది. ఇది మన ఊరి పితామహుడి కి గుర్తింపు లేకుండా పోతుంది. జాతీయ జెండా అంటే ఎవ్వరూ విమర్శించలేరని నాగేశ్వరరెడ్డి ఒక రహస్య అజెండాతో సోమప్ప గారి గుర్తింపు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నాడు. ఇది ప్రజలు గ్రహించాలి.

జాతీయ జెండా పెట్టడానికి మన ఊరిలో ఎన్నో ప్రాంతాలు ఉన్నాయి. కావాల్సిన ప్రాంతంలో జాతీయ జెండా ఏర్పాటు చేస్తే మంచిదే. ఎమ్మిగనూరు పితామహుడిగా పేరున్న సోమప్ప గారి పేరున్న సోమప్ప సర్కిల్ పేరును కనుమరుగు చేయాలన్న కుట్రను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ప్రజలు కూడా ఈ కుట్రను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని కోరుతున్నాను. ఇట్లు కోనేరు నాగేంద్ర ప్రసాద్.

# దేవుడి పేరు చెప్పగానే క్యూ కట్టిన జనాలు..

విశాఖపట్నం: బీచ్ రోడ్డులో అయోధ్య రామాలయం సెట్ వేసి దర్శనాలు, కళ్యాణాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం దేవస్థానం పేరుతో కళ్యాణోత్సవం టికెట్లు అమ్మడంపై ఫిర్యాదు రావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. టికెట్ ధరలు, ట్రాఫిక్ సమస్యలు, భక్తుల రద్దీతో ఈ సెట్ వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖపట్నంలో భక్తి పేరుతో కొత్త వ్యాపారం మొదలు పెట్టారు.. ఏకంగా అయోధ్య రామాలయం సెట్ రూపంలో కొత్త దందాను ఎంచుకున్నారు. విశాఖపట్నం బీచ్ రోడ్డులో అయోధ్య రామాలయం సెట్ వేసి మరీ దర్శనాలు, కళ్యాణాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. కొద్దిరోజులుగా ఈ దందా నడస్తుండగా.. తాజాగా పోలీసులు రంగంలోకి దిగి నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. మే నెలలో.. విశాఖపట్నం బీచ్ రోడ్డులో పార్క్ హెూటల్ పక్కన ఖాళీ స్థలంలో ఈ అయోధ్య రామాలయం సెట్ వేశారు.. రెండు నెలల్లో తీసేస్తామని చెప్పారు. కానీ భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. వీరు దర్శనం కోసం టికెట్ ధర రూ.50 చొప్పున.. భక్తులు చెప్పులు పెట్టుకోవడానికి రూ.5 అదనంగా తీసుకుంటున్నారు. అంతేకాదు రాముడిని సరిగ్గా చూసేలోపే సిబ్బంది బయటకు పంపేస్తున్నారట.

అంతేకాదు ఈ సెట్ వేసిన వాళ్లు.. పగటిపూట భక్తులు లేకపోయినా సరే.. ఉన్నట్లుగా నమ్మించేందుకు అక్కడి సిబ్బందితో పెద్దగా కేకలు వేయిస్తూ హడావుడి చేయిస్తున్నారట. అయితే ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో భక్తులు రద్దీ ఎక్కువగా ఉండటంతో బౌన్సర్లను కూడా ఏర్పాటు చేశారట. శని, ఆదివారాల్లో వస్తే భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. ఈ సెట్, భక్తుల రద్దీ దెబ్బకు కార్లు, బైక్‌లు బీచ్ రోడ్డులో పార్క్ చేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతోందనే విమర్శలు కూడా వచ్చాయి. అంతేకాదు ఈ సెట్ చుట్టుపక్కల పార్కింగ్ ప్రదేశాలన్నీ నిండిపోయి ప్రజలు నడవడానికి కూడా లేకుండా పోయిందంటున్నారు.

ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. ఈ అయోధ్య నమూనా ఆలయంలో ఈ నెల 29న కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నామని.. దీని కోసం భద్రాచలం దేవస్థానం నుంచి కళ్యాణోత్సవం జరిపించేందుకు పండితులు వస్తున్నారని చెప్పి.. కళ్యాణోత్సవం పేరుతో రూ. 2,999 టికెట్ అమ్ముతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. అయితే భద్రాచలం ఆలయ అధికారులు తమకు సంబంధం లేదన్నారు. తమ దేవస్థానం నుంచి ఎవరూ విశాఖపట్నం వెళ్లడం లేదన్నారు. అసలు తమకు ఆ కళ్యాణోత్సవం గురించి సమాచారం కూడా లేదన్నారు.

భద్రాచలం ఆలయం పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈవో రమాదేవి అన్నారు. ఆమె ఈ వ్యవహారంపై విశాఖపట్నం కలెక్టర్, పోలీస్ కమిషనర్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్, దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పుడు ఈ దందా మొత్తం బయటపడింది.. పోలీసులు కేసు నమోదు చేసి నిర్వాహకుల్ని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సెట్ వెనుక ఎవరి హస్తం ఉందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మొత్తానికి విశాఖపట్నంలో ఈ అయోధ్య రామాలయం సెట్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

# ఆ రైతులకు కేంద్రం తీపికబురు..



ఏపీ: ఆంధ్రప్రదేశ్‌లో మామిడి రైతులకు ఊరట దక్కింది. తోతాపురి మామిడికి క్వింటాకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను రూ.1,490గా నిర్ణయించారు. ఈ మేరకు కేంద్రం నుంచి ప్రకటన విడుదల చేశారు. కేంద్రం, ఏపీ ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను చెల్లిస్తాయి. ఈ డబ్బుల్ని నేరుగా రైతుల బ్యాంకు అకౌంట్‌లలో జమ చేస్తారు. ఇంటర్వెన్షన్ ధర విషయంపై స్పందించి.. ఆ సమస్యను పరిష్కరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రైతులు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం 2025-26 సంవత్స రానికి MIS కింద 1.62 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని కొనుగోలు చేయడానికి అవకాశం కలుగుతుంది.

కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నిర్ణయంతో మామిడి ధరల పడిపోకుండా.. రైతులకు మేలు కలిగింది అంటున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తుంది అన్నారు. రైతుల జీవితాల్లో ఇది వెలుగులు నింపుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు చేస్తున్న కృషిని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అభినందించారు.

మామిడి రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. ఆయన చొరవతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని తోతాపురి మామిడి రైతులకు మద్దతుగా వ్యాపారులు ముందుకు వచ్చారు. అలాగే, చాలా ప్రాసెసింగ్ యూనిట్లు కూడా రైతులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చాయి. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. అంతేకాదు ఏపీ ప్రభుత్వం గత వారం కూడా మామిడి రైతుల అకౌంట్‌లలో రూ.260 కోట్లు బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేయనుంది. అలాగే తాజాగా మరో రూ.150 కోట్లు వారి ఖాతాలకు జమ చేయబోతోంది. మొత్తం మీద ఏపీ ప్రభుత్వం తోతాపురి మామిడి రైతుల్ని ఆదుకునే పనిలో ఉంది.

# ఆ పథకాన్ని అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలి..



ఏపీ: మంత్రి అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మహిళలకు సంబంధించిన పథకం అమలుపై స్పందిస్తూ.. మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం అందించే ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సి వస్తుందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇది ఒక్కటే మిగిలి ఉందని, దీనిపై చంద్రబాబు ఆలోచన చేస్తున్నారని ఆయన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆ పథకాన్ని అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలి అంటూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం గుర్రంపాలెంతో పాటుగా విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. అచ్చెన్నాయుడు స్వయంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అయితే మంగళపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

ఏపీలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ కింద ఇచ్చిన హామీలలో అన్నీ అమలు చేశామన్నారు. కానీ ఒక్క పథకం మాత్రం మిగిలిపోతుందని.. అది ఆడవాళ్లకు నెలకు రూ.1500 ఆడబిడ్డ నిధి పథకం అన్నారు.. అది చెయ్యాలంటే ఆంధ్రాను అమ్మాలని.. దీనిపై ఇంకా ఆలోచన చేస్తున్నామన్నారు. అంటే ఈ పథకం అమలు చేయడానికి అంత డబ్బు అవసరం ఉంటుందన్నారు. అందుకే ఈ ఫథకాన్ని ఏమి చేయాలి, ఎలా ఆ పథకం అమలు చేయాలి అని చంద్రబాబు ఆలోచన చేస్తున్నారని అచ్చెన్నాయుడు చెప్పుకొచ్చారు. అయితే మంత్రి మాట్లాడిన వీడియో వైరల్ అవుతోంది. సూర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రకటించిన ఈ పథకం గురించి అచ్చెన్నాయుడు ఇలా మాట్లాడటం చర్చనీయాశంమైంది. మరి ఈ అంశంపై ముఖ్య మంత్రి ఎలా స్పందిస్తారన్నది చూడాలి. 2024 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే.. వారి చెంప పగలగొట్టాలని అదే సభలో మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సీఎంగా జగన్ వంటి వ్యక్తి మళ్లీ రాకుండా చూడాలని.. జగన్‌లాంటి భూతాన్ని 100 అడుగులు గొయ్యితీసి కప్పేయాలి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ భూతం మళ్లీ వస్తే ప్రజలు నష్టపోతారని.. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందిస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు.. ఒకవేళ ఎవరైనా తప్పుగా మాట్లాడితే ఊరుకునేది లేదని.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో సంచలనంగా మారిన మద్యం కుంభ కోణంలో బిగ్‌బాస్ ఎవరో ప్రజలకు తెలుసన్నారు మంత్రి అచ్చెన్నాయుడు. తాడేపల్లి ప్యాలెస్ దొంగల ముఠా నాయకుడి గుట్టును సిట్ రట్టు చేసిందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన వైఎస్సా ర్‌సీపీ.. గత ఐదేళ్లలో విధ్వంసం సృష్టించిందని విమర్శి ంచారు. రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలను భయ పెట్టి పారిపోయేలా చేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో దెబ్బతిన్న వ్యవస్థలను, కుదేలైన ఆర్థిక స్థితిని తిరిగి గాడిలో పెడుతున్నారన్నారు. ఏపీ ప్రజలు వైకుంఠపాళి ఆడకుండా మంచి చేసే ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు మంత్రి అచ్చెన్నాయుడు.

# లిక్కర్ స్కామ్‌లో మరో సంచలనం..



ఏపీ: సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్‌లో తిలక్ నగర్ ఇండస్ట్రీస్, అంబర్ స్పిరిట్స్ వంటి పలు కంపెనీలు అక్రమాలకు పాల్పడ్డాయని సిట్ ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ కంపెనీలు లంచాలు ఇచ్చి, అక్రమంగా లాభాలు పొందాయని ఆరోపణలు ఉన్నాయి. తిలక్ నగర్ ఇండస్ట్రీస్ ఒక్కటే రూ. 218 కోట్ల లంచం ఇచ్చిందని, నగల వ్యాపారుల ద్వారా డబ్బు మార్పిడి చేసిందని సిట్ గుర్తించింది. ఈ ఆరోపణలను తిలక్ నగర్ ఇండస్ట్రీస్ ఖండించింది. ఆంధ్రప్రదేశ్‌లో సంచలనంగా మారిన లిక్కర్ స్కామ్ రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసులో ఇప్పటికే 11మందిని సిట్ అరెస్ట్ చేసింది. తాజాగా వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్ రెడ్డిని కూడా అరెస్ట్ చేయగా.. కోర్టు రిమాండ్ విధించింది. అయితే తాజాగా ఈ లిక్కర్ స్కామ్‌లో మరో సంచలనం తెరపైకి వచ్చింది.. ఫేమస్ లిక్కర్ బ్రాండ్‌ల తయారు చేసే బడా కంపెనీల పేర్లు బయటకొచ్చాయి. ఆ కంపెనీలు మద్యం వ్యాపారంలో అక్రమాలకు పాల్పడ్డాయంటూ ఛార్జ్‌షీట్‌లో పేర్లు ప్రస్తావించారు. ఈ మేరకు సిట్ విచారణలో కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.. కొన్ని మద్యం కంపెనీలు లంచాలు ఇచ్చి అక్రమంగా లాభాలు పొందాయని చెబుతున్నారు. వీటిలో తిలక్ ఇండస్ట్రీస్, అంబర్ స్పిరిట్స్, ట్రాపికల్, ఎస్ఎన్‌జీ షుగర్స్ సహా 12 మద్యం కంపెనీల పేర్లు సిట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో ప్రస్తావించారు. ఈ మద్యం కుంభకోణంలో ఈ కంపెనీల పాత్రపై దర్యాప్తు జరుగుతోంది.

ఈ మద్యం కుంభకోణంలో తిలక్ నగర్ ఇండస్ట్రీస్ కంపెనీ పేరు కూడా ఉంది. ఈ కంపెనీ మ్యాన్షన్ హౌస్ బ్రాండ్‌ను అమ్ముతుంది. అలాగే అంబర్ స్పిరిట్స్, ట్రాపికల్ ఇన్ బెవ్ షుగర్స్ వంటి చాలా కంపెనీలపై ఈ ఆరోపణలు ఉన్నాయి. తిలక్ నగర్ ఇండస్ట్రీస్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా దాదాపు రూ. 1,472 కోట్ల ఆదాయం పొందింది. ఇందులో సుమారు రూ. 218 కోట్లు లంచంగా ఇచ్చిందని సిట్ ఛార్జ్ షీట్‌లో పేర్కొంది. ఈ లంచం మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ఎక్కువ సరుకు అమ్మడానికి, ధరలు పెంచడానికి ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి.

షుగర్స్ కంపెనీ కూడా దాదాపు రూ. 350 కోట్ల వరకు లంచం ఇచ్చిందని పోలీసులు చెబుతున్నారు. డిస్టిలరీస్ కంపెనీ సుమారు రూ. 29.80 కోట్లు, కంపెనీ రూ. 37.92 కోట్లు లంచంగా ఇచ్చాయని ఛార్జ్ షీట్‌లో ఉంది. బెవరేజెస్ కంపెనీ 2019 నుంచి 2024 మధ్యలో ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద మొత్తంలో మద్యం సరఫరా చేసింది. ఈ కంపెనీ నుంచి దాదాపు రూ. 360 కోట్లు పొందిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు విచారణలో తిలక్ నగర్ ఇండస్ట్రీస్ కొన్ని అనుమానాస్పద లావాదేవీలు చేసినట్లు సిట్ గుర్తించిందట. వచ్చిన డబ్బును నాలుగు జ్యువెలరీ కంపెనీల ద్వారా లెక్కల్లో చూపకుండా మార్చారని ఆరోపణలు ఉన్నాయి. తిలక్ నగర్ కంపెనీ లో తనకున్న పలుకుబడిని ఉపయోగించి భారీగా అమ్మకాలు చేసిందని ఛార్జ్ షీట్‌లో పేర్కొన్నారు. ఈ లాభాన్ని నిలుపుకోవడానికి.. తన ఆదాయంలో కొంత భాగాన్ని నగల వ్యాపారులకు మళ్లించిందని.. ఆ నగల ద్వారా వచ్చిన బంగారాన్ని సిండికేట్ సభ్యులకు చేర్చిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా చేయడం ద్వారా ఈ వ్యవహారమంతా చట్టబద్ధమైన వ్యాపారంగా కనిపించేలా జాగ్రత్త పడ్డారని చెబుతున్నారు.. జీఎస్టీ కట్టినట్లు కూడా చూపించారు. కానీ నిజానికి ఇది తెల్ల డబ్బును నల్ల డబ్బుగా మార్చే ఒక పద్ధతి అంటోంది సిట్. పెద్ద కంపెనీలు కూడా తమ ఆదాయంలో కొంత భాగాన్ని బంగారంగా మార్చి లంచాలుగా ఇవ్వడానికి సిద్ధపడ్డాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే.. తిలక్ నగర్ ఇండస్ట్రీస్ మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తోంది. తమకు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదని చెబుతోంది. 'ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో చాలా మంచి పాలన అందించారు.. పరిశ్రమ అభివృద్ధికి ఆయన ఎప్పుడూ ప్రోత్సాహం అందించారు. పరిశ్రమకు ప్రోత్సహకాలు అందిస్తే ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరుగుతుంది. కాబట్టి ఈసారి కూడా ఆయన పరిశ్రమకు మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నాను' అన్నారు తిలక్ నగర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అమిత్ దహనుకర్.

బెవరేజెస్‌కు సంబంధించిన బిరా కంపెనీకి సరుకులు సరఫరా చేసే సంస్థలు.. ఎలాంటి ప్యాకేజింగ్ మెటీరియల్స్ ముడి సరుకులు సరఫరా చేయకుండానే నకిలీ బిల్లులు సృష్టించాయి.. ఆ డబ్బును మార్చి బెవరేజెస్ కంపెనీకి చేర్చాయి' అని సిట్ చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ ఒకప్పుడు మద్యం తాగే రాష్ట్రాల్లో టాప్ 3లో ఉండేది.. కానీ గత ఐదేళ్లలో అమ్మకాలు సగానికి పడిపోయాయి అంటున్నారు. ధరలు పెంచడంతో పాటుగా, లోకల్ కంపెనీలకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడమే కారణం అంటున్నారు. గతేడాది అక్టోబర్‌లో ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని అమలు చేస్తోంది.. రిటైల్ అవుట్‌లెట్‌ల సంఖ్యను పెంచింది.

# దక్షిణాసియా ఖండంలో రైళ్లు రయ్ రయ్‌మంటూ



విజయవాడ: రైల్వే డివిజన్‌లో రూ.3246 కోట్లతో చేపట్టిన మూడో రైలు మార్గం పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. దీంతో రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నాయి. మరోవైపు, మనుబోలు-గూడూరు మధ్య రైల్వే వంతెన దక్షిణాసియా ఖండంలోనే అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 2027 నాటికి విజయవాడ-గూడూరు మధ్య లెవెల్ క్రాసింగ్ గేట్లు తొలగించాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రయాణికుల భద్రత కోసం రైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ పరిధిలోని విజయవాడ రైల్వే డివిజన్‌కు సంబంధించి ప్రయాణికులకు, సరకు రవాణా కోసం మూడో రైలు మార్గం పూర్తవుతోంది. ఈ ప్రాజెక్టు 2015-16లో రూ.3246 కోట్లతో 288 కిలోమీటర్ల మేర ప్రారంభమైంది.. అన్ని అడ్డంకుల్ని దాటుకుని ఈ మార్గం పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ మూడో లైన్‌తో రైళ్లు వేగంగా, సకాలంలో గమ్యస్థానాలకు చేరుతాయి అంటున్నారు అధికారులు. అయితే ఈ మూడో రైలు మార్గం సంగతి అలా ఉంటే.. మనుబోలు-గూడూరు మధ్య ఉన్న రైల్వే వంతెన ఇప్పుడు అరుదైన ఘనతను అందుకుంటోంది. ఈ బ్రిడ్జి దక్షిణాసియా ఖండంలోనే చాలా అరుదైనదని చెబుతున్నారు అధికారులు. ఈ బ్రిడ్జిపై పై నుంచి, కింద నుంచి రైళ్లు పరుగులు తీస్తుంటే చూడటానికి అందంగా ఉంటుంది అంటున్నారు. నెల్లూరు జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపుని తీసుకొస్తోంది. ఎగువ,దిగువ మార్గాల్లో ఆర్ఓఆర్ బ్రిడ్జి నిర్మించడం వల్ల భారీ వర్షాలు, వరదలు వచ్చినా రైళ్లు ఆగకుండా వెళ్లొచ్చు అంటున్నారు.

ప్రస్తుతం మూడో లైన్ పనులు బాపట్ల-విజయవాడ మధ్య వేగంగా జరుగుతున్నాయి. అలాగే తెనాలి రైల్వేస్టేషన్ జంక్షన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు పూర్తికాగానే ఈ మూడో లైన్ ప్రారంభించే అవకాశం ఉందంటున్నారు. అప్పుడు ఈ మార్గంలో వెళ్లే రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో నడుస్తాయంటున్నారు.. అయితే 130 కిలోమీటర్ల వేగం వరకు ఎలాంటి ఇబ్బంది ఉండందని అంచనాలు ఉన్నాయి. ఈ మూడో మార్గం అందుబాటులోకి వస్తే దక్షిణ మధ్య రైల్వేకు విజయవాడ డివిజన్ సరకు రవాణా వ్యవస్థలో ఆదాయం కూడా పెరుగుతుందంటున్నారు. ప్రయాణికుల రైళ్లు కూడా సరైన సమయానికి గమ్యస్థానానికి చేరుకోవచ్చంటున్నారు. ఇటు రైల్వే శాఖ విజయవాడ-గూడూరు మధ్య లెవెల్ క్రాసింగ్ గేట్లు లేకుండా చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఈ మేరకు అవసరమైన చోట్ల ఆర్‌యూబీలు నిర్మిస్తున్నారు. 2027 చివరి నాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని భావిస్తున్నారు రైల్వేశాఖ అధికారులు. ఇటు రైల్వేశాఖ ఇటీవల రైళ్లలో ప్రయాణికుల భద్రత కోసం రైలు బోగీలలో కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని రైలు ఎంత వేగంగా వెళున్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా రికార్డ్ చేసేలా ప్లాన్ చేశారు. అయితే త్వరలోనే విజయవాడ డివిజన్‌లోని అన్ని రైళ్లలోని బోగీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు పూర్తి చేస్తామంటున్నారు అధికారులు.

# ఈ స్టేషన్లలోనూ ఆగుతాయి

ఏపీ: అధికారులు పలు రైళ్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 2 నుంచి గుంటూరు, రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది (హాల్టు).. గుంటూరు, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ (17281) పుట్లచెరువు రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది (హాల్టు).. విశాఖపట్నం, సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (20833/20834) రైలు సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది (హాల్టు) అని తెలిపారు. ఆగస్టు 5 నుంచి బిలాస్‌పూర్, తిరుపతి (17481).. పూరి, తిరుపతి (17479).. తిరుప తి, కాకినాడ టౌన్ (17249) ఎక్స్‌ప్రెస్‌లకు చిన్నగంజాం రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది (హాల్టు).. ఆగస్టు 8 నుంచి.. ఎర్నాకుళం, భరౌని (12522) ఎక్స్‌ప్రెస్‌కు చీరాల రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది (హాల్టు).. ఆగస్టు 24 నుంచి సికింద్రాబాద్, విశాఖపట్నం (20707/20708) ఎక్స్‌ప్రెస్ ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది (హాల్టు) అని ప్రకటించారు. మరోవైపు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ టు లింగంపల్లి (12795/12796) ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా ఒక థర్డ్ ఏసీ బోగీని ఏర్పాటు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇన్‌స్టా ఫ్రెండ్ పిలిచిందని వెళ్లాడు..

కృష్ణా: జిల్లాకు చెందిన యువకుడికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన అమ్మాయి భీమవరం రమ్మని పిలిచింది. స్నేహితుడితో కలిసి వెళ్లిన అతనికి ఊహించని అనుభవం ఎదురైంది. అమ్మాయితో మాట్లాడి తిరిగి వెళ్తుండగా ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. స్తంభానికి కట్టేసి కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అసలు ఆ అమ్మాయి ఎందుకు పిలిచింది? దాడి చేసిన ఆ వ్యక్తులెవరు? ఈ సంఘటన వెనుక అసలు కారణం ఏమిటి?

ఆ యువకుడ్ని ఇన్‌స్టాలో పరిచయమైన అమ్మాయి తన ఇంటికి రమ్మని పిలిచింది.. నీతో మాట్లాడాలని చెప్పింది. అసలే అమ్మాయి పిలిచింది.. ఇక ఆగుతాడా.. తన స్నేహితుడ్ని తోడుగా తీసుకుని వెళ్లాడు. చక్కగా అమ్మాయితో ముచ్చట్లు పెట్టాడు.. ఇంతలో ఆ యువకుడికి ఊహించని పరిస్థితి ఎదురైంది. కృష్ణా జిల్లా కృతివెన్ను మండలం గొల్లపాలేనికి చెందిన యువకుడు ఆదివారం రోజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వెళ్లాడు. అక్కడ స్థానికంగా ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన స్నేహితుడ్ని పరామర్శించాడు. అయితే యువకుడు భీమవరం వచ్చిన సంగతి తన ఇన్‌స్టా ఫ్రెండ్‌గా ఉన్న అమ్మాయికి తెలిసింది. అతడు స్నేహితుడ్ని పరామర్శించిన తర్వాత ఆదివారం రాత్రి పొద్దుపోయాక మరో యువకుడితో కలిసి తిరిగి ఇంటికి బయల్దేరాడు. వీరిద్దరు భీమవరం మండలం దేగాపురం వరకు వెళ్లిన తర్వాత భీమవరానికి చెందిన ఇన్‌స్టా స్నేహితురాలు ఇంటికి రమ్మని వాట్సాప్‌లో మెసేజ్ పంపింది.. 'నీతో' మాట్లాడాలని చెప్పింది. అమ్మాయి రమ్మని పిలవడంతో ఆ యువకుడు తన స్నేహితుడ్ని వెంటబెట్టుకుని అక్కడి నుంచి తిరిగి ఆమె ఇంటి దగ్గరకు వెళ్లాడు. ఆమెతో పది నిమిషాల పాటూ మాట్లాడిన యువకుడు తిరిగి వెళ్లిపోతుండగా ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. యువకుడ్ని స్తంభానికి కట్టేసి కొట్టడంతో తలకు గాయమైంది. అతని వెంట వచ్చిన స్నేహితుడిపై కూడా దాడి చేయడంతో గాయాలయ్యాయి.

వెంటనే ఇద్దరు బాధితుల్ని భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వీరిద్దరు ఇచ్చిన ఫిర్యాదుతో ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అమ్మాయిల కోసం వస్తారా అంటూ ఆ ఐదుగురు వ్యక్తులు వీరిద్దర్ని చితకబాదినట్లు చెబుతున్నారు. పాపం ఇన్‌స్టా ఫ్రెండ్ పిలిచిందని వెళ్లిన యువకుడు, అతడి స్నేహితుడు అనసవరంగా వెళ్లి దెబ్బలు తిని ఆస్పత్రి పాలయ్యారు. వీరిద్దరిపై దాడి చేసిన ఐదుగురు వ్యక్తులు ఎవరు అనేది ఇంకా క్లారిటీ లేదు.. ఆ యువతిని కలిసినందుకు దాడి చేశారా.. ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్నది తెలియాల్సి ఉంది.

# మకాం మార్చనున్న పెద్దిరెడ్డి కుటుంబం..



ఏపీ: మాజీ మంత్రి, వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం రాజమండ్రిలో ఇల్లు అద్దెకు తీసుకున్నట్లు తెలిసింది. లిక్కర్ కేసులో అరెస్టైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనయుడు మిథున్ రెడ్డి.. రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తనకు మూడు పూటలా ఇంటి భోజనంతో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని మిథున్ రెడ్డి కోరుతున్నారు. ఈ క్రమంలోనే తనయుడి కోసం పెద్దిరెడ్డి రాజమండ్రిలో ఇల్లు అద్దెకు తీసుకున్నట్లు సమాచారం. అక్కడి నుంచే మిథున్ రెడ్డికి ఇంటి భోజనం పంపించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి.. ఏపీ రాజకీయాల్లో ఇటీవలి కాలంలో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు. ఏపీ లిక్కర్ కేసులో మిథున్ రెడ్డి అరెస్ట్ తర్వాత.. ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా మారిపోయాయి. లిక్కర్ కేసులో ఏ4గా ఉన్న మిథున్ రెడ్డిని సిట్ అధికారులు శనివారం విచారించారు. ఏడు గంటల సుదీర్ఘ విచారణ అనంతరం అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత విజయవాడ ఏసీబీ కోర్టుకు తరలింపు.. ఆగస్ట్ ఒకటో తేదీ వరకూ మిథున్ రెడ్డికి రిమాండ్ విధింపు ఇలా పరిణామాలన్నీ వరుసగా జరిగిపోయాయి. కోర్టు రిమాండ్ విధించటంతో మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అక్కడే రిమాండ్ ఖైదీగా ఉన్నారు మిథున్ రెడ్డి.

ఈ పరిణామాల నేపథ్యంలో మరో వార్త ప్రముఖంగా వినిపిస్తోంది.. అదే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం రాజమహేంద్రవరంలో ఇల్లు అద్దెకు తీసుకుందని.. తన కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఏపీ ప్రభుత్వం కక్షపూరితంగా అరెస్ట్ చేసిందని ఆరోపిస్తున్నారు పెద్దిరెడ్డి. గతంలోనూ ఇలా తప్పుడు కేసులు పెట్టారని.. కానీ ఏదీ నిలబడలేదన్నారు. ఇప్పుడు కూడా మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా ఈ కేసు నుంచి బయటపడతారని పెద్దిరెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం రాజమండ్రిలో ఇల్లు అద్దెకు తీసుకుందని సమాచారం.

రాజమండ్రిలో రిమాండ్ ఖైదీగా ఉన్న మిథున్ రెడ్డి.. తనకు ఇంటి భోజనంతో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఈ క్రమంలోనే విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్లు వేశారు మిథున్ రెడ్డి. టిఫిన్‌తో పాటుగా మూడు పూటలా ఇంటి నుంచి భోజనం, వాటర్ బాటిల్స్, వెస్ట్రన్ కమోడ్ ఉండే ప్రత్యేక గది, టీవీ, న్యూస్ పేపర్లు, ఓ సహాయకుడు ఇలాంటి సౌకర్యాలు కల్పించాలని మిథున్ రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్ల మీద విచారణ జరిపిన విజయవాడ ఏసీబీ కోర్టు.. అభ్యంతరాలుంటే చెప్పాలని రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. దీంతో మంగళవారం విచారణకు హాజరైన రాజమండ్రి జైలు అధికారి.. సుప్రీంకోర్టు రూల్స్ ప్రకారం మిథున్ రెడ్డికి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అలాగే ఇంటి నుంచి భోజనం అనుమతించాలంటే అండర్ టేకింగ్ లెటర్ అవసరమని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే రిమాండ్ ఖైదీగా ఉన్న మిథున్ రెడ్డికి ఇంటి భోజనం పంపించేందుకు.. పెద్దిరెడ్డి కుటుంబం రాజమండ్రిలో ఇల్లు అద్దెకు తీసుకుందని వార్తలు వస్తున్నాయి. రాజమండ్రి ఏవీ అప్పారావు రోడ్డులో ఓ విల్లాను పెద్దిరెడ్డి కుటుంబం అద్దెకు తీసుకుందని.. అక్కడి నుంచే భోజనం, ఇతర సామాగ్రి పంపించనున్నట్లు తెలిసింది. మరోవైపు ప్రస్తుత సీఎం నారా చంద్రబాబు నాయుడు.. గతంలో స్కిల్ స్కామ్‌లో అరెస్టైన సందర్భంలోనూ రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. 50కి పైగా రోజుల తర్వాత బెయిల్ రావటంతో చంద్రబాబు రాజమండ్రి జైలు నుంచి విడుదలయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు జైలు అధికారులు ఇంటి భోజనం అనుమతించారు.

# మా వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం..

**తెలంగాణ:** బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు బీసీ రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమేనని అందుకు తమిళనాడు ఉదాహరణగా ఉందని గుర్తుచేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు రాజీనామా చేసి రిజర్వేషన్లు సాధించి చూపాలని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలన్నారు. బీజేపీది బీసీ వ్యతిరేక వైఖరి అని, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంత్రి స్పష్టం చేశారు.



బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు చేసిన వ్యాఖ్యలపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యమన్న బీజేపీ వాదనను మంత్రి తీవ్రంగా ఖండించారు. బీజేపీ మరోసారి బీసీల పట్ల తన అసలు స్వభావాన్ని, కుట్రను బయటపెట్టిందని ఆయన ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గతంలో పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో ఇది జరిగిందని గుర్తు చేశారు.

'తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి. ఎందుకు రిజర్వేషన్లు అమలు కావో చూస్తాం. రాజీనామా చేయకుంటే రిజర్వేషన్లు సాధించి పెట్టండి.' అని బీజేపీకి సవాల్ విసిరారు. సుప్రీంకోర్టు ఇందిరా సహానీ కేసులో రాష్ట్రాలకు ప్రామాణికమైన ఎంపెరికల్ డేటా ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టంగా చెప్పిందని మంత్రి గుర్తు చేశారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి కేబినెట్, శాసనసభ, గవర్నర్ ఆమోదంతో ఈ ప్రతిపాదనను ఢిల్లీకి పంపిందని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని.. బరాబర్ రిజర్వేషన్లు అధికారికంగా అమలు చేస్తామన్నారు. అనాడు మండల కమిషన్ తీసుకొస్తే "కమండల్" అన్నది బీజేపీనేని ఎద్దేవా చేశారు. మళ్లీ బీజేపీ తమ వక్ర బుద్ధిని, బీసీల పట్ల కుట్రను బయటపెట్టిందని విమర్శించారు. తెలంగాణలోని అన్ని బీసీ వర్గాలు, కుల సంఘాలు బీజేపీ నిజస్వరూపాన్ని గమనించి రిజర్వేషన్ల ప్రక్రియను కాపాడుకునే దానిలో ముందుండాలని మంత్రి పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తప్పకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిందేనని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గతంలో జనహిత అభియాన్ కేసులో %జుఔూ% (ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు) రిజర్వేషన్ల సందర్భంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేశారని గుర్తు చేశారు. ప్రామాణిక నివేదిక ప్రకారం సమాచారం సుప్రీంకోర్టులో ఉందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని మంత్రి పునరుద్ఘాటించారు. 'మా ముఖ్యమంత్రి రెడ్డి అయితే.. ఎస్సీ ఉప ముఖ్యమంత్రి, మా పీసీసీ అధ్యక్షుడు బీసీ ఉన్నారు. మా వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం' అని మంత్రి పొన్నం వార్నింగ్ ఇచ్చారు.

## ఆర్మీకి డ్రోన్లు అమ్ముతున్న బిట్స్ పిలాని స్టూడెంట్స్

**హైదరాబాద్:** త్రీ ఇడియట్స్ సినిమాలో తన టాలెంట్‌తో డ్రోన్ తయారు చేసి ప్రిన్సిపల్ నుంచి సరైన మద్దతు లేక చనిపోయిన జాయ్ లోబో పాత్ర గుర్తుంది కదా? హాస్టల్ రూంలో అతడు డ్రోన్ తయారు చేయగా.. వైరస్ (ప్రిన్సిపల్) ఆ ప్రాజెక్టును ఒప్పుకోకపోగా.. అవమానించటంతో అతడు సూసైడ్ చేసుకుంటాడు. బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లోనూ జాయ్ లోబోలు ఉన్నారు. క్యాంపస్‌కు చెందిన ఇద్దరు 20 ఏళ్ల ఇంజినీరింగ్ స్టూడెంట్స్.. త్రీ ఇడియట్స్ సినిమాను తలదన్నేలా అద్భుతం సృష్టించారు. అచ్చం ఆ మూవీలో మాదిరిగానే తమ హాస్టల్ రూంలోనే బాంబులు వేయగల కమికేజ్ డ్రోన్‌లను తయారు చేశారు. అంతే కాదు.. వాటిని భారత సైన్యానికి విక్రయిస్తూ దేశ రక్షణలో భాగమయ్యారు. జమ్మూ, చండీగఢ్, బెంగాల్‌లోని పనగఢ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని ఆర్మీ యూనిట్లు ఇప్పటికే వీరి డ్రోన్‌లను కొనుగోలు చేశాయి.



బిట్స్ పిలానిలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న రాజస్థాన్‌కు చెందిన జయంత్ ఖత్రీ, కోల్‌కతాకు చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థి సౌర్య చౌదరి 'అపోలియన్ డైనమిక్స్' అనే స్టార్టప్‌ను ప్రారంభించి కేవలం రెండు నెలల్లోనే కమికేజ్ డ్రోన్లు తయారు చేశారు. వాటిని ఇండియన్ ఆర్మీకి విక్రయిస్తూ తమ టాలెంట్ ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారు. దిగుమతి చేసుకున్న డ్రోన్‌లపై ఇండియన్ ఆర్మీ ఆధారపడ టాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని వారు చెబుతున్నారు. సాధారణ విడిభాగాలతోనే డ్రోన్‌లను రూపొందించి, భారతీయ భూభాగానికి అనుగుణంగా సిస్టమ్‌లను మోడిఫై చేశారు. అనంతరం లింక్డ్ఇన్‌లో ఆర్మీ అధికారులకు కోల్డ్ మెసేజ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను పరిచయం చేశారు. ఒక కల్నల్ స్పందించి.. డెమో కోసం వీరిని చండీగఢ్‌కు పిలిచారు. చండీగఢ్‌లో బాంబులు వేయగల రేసింగ్ డ్రోన్‌ల ప్రత్యక్ష డెమో జరగ్గా.. వీరి డ్రోన్లు అద్భుత పనితీరు కనబరిచాయి. దీంతో ఇండియన్ ఆర్మీ నుంచి ఆర్డర్లు పెరిగిటన్లు ఖత్రీ వెల్లడించారు.

కాగా, వీరి ప్రధాన ఉత్పత్తి కమికేజ్ డ్రోన్. ఇది గంటకు 300 కి.మీ. పైగా వేగంతో ప్రయాణిస్తుంది, ఇది సాధారణ వాణిజ్యల కంటే ఐదు రెట్లు ఎక్కువ వేగం. అంతేకాదు.. ఇది 1 కిలోల పేలోడ్‌ను అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యంపై గురిపెట్ట గలదు. వీరి డ్రోన్‌లు వేగంగా ప్రయాణించటమే కాదు.. రాడార్‌లకు కూడా చిక్కకుండా ప్రయాణం చేయలగవు. ప్రతి డ్రోన్‌ను ధృఢత్వం, అత్యంత విశ్వసనీయత, అనుకూలతతో తయారు చేస్తామని సౌర్య చౌదరి తెలిపారు. 'రోబోటిక్స్ పట్ల మాకు ఉన్న ప్రేమ మమ్మల్ని కలిపింది. మేము క్యాంపస్‌లో డిఫెన్స్-టెక్ క్లబ్‌తో ప్రారంభించాం. తర్వాత ఆర్డర్‌లు రావడం మొదలయ్యాయి. అప్పుడే మేము దీన్ని పెద్ద ఎత్తున చేయాలని నిర్ణయించుకున్నాం." అని చౌదరి అన్నారు.

ప్రస్తుతం వీరి బృందంలో ఆరుగురు బీటెక్ సెకండియర్ విద్యార్థులు ఉన్నారు. మిషన్ సౌలభ్యాన్ని పెంచడానికి నెక్స్ట్-జనరేషన్ మరియు ఫిక్స్‌డ్-వింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై పనిచేస్తున్నారు. అంతేకాదు.. సైనిక సిబ్బందికి, గతంలో ఎటువంటి విమానయాన అనుభవం లేని వారికి కూడా ప్రత్యక్ష శిక్షణ ఇస్తున్నారు.

## సర్పంచ్ ఎన్నికలపై అప్డేట్.. సన్నాహాలు షురూ..!

**తెలంగాణ:** సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు కసరత్తు షురూ అయింది. పంచాయతీరాజ్‌శాఖ కొత్త ఓటర్ల జాబితాను రూపొంది స్తోంది. పెరిగిన పంచాయతీలు, వార్డులకు అనుగుణంగా టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో పంచాయతీ కార్యదర్శులు జాబితాను అప్‌లోడ్ చేస్తారు. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహిం చాల్సి ఉండగా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా అమలు చేయాలని భావిస్తోంది. ఈ ప్రక్రియలన్నీ పూర్తయ్యాక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.



తెలంగాణ సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలపై కీలక అప్డేట్. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం కొత్తగా ఓటర్ల జాబితాను రూపొందించాలని పంచాయతీరాజ్‌శాఖ నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఈ సన్నాహాలు జరుగుతున్నాయి. పంచాయతీలు, వార్డుల సంఖ్య మరింత పెరగటంతో పూర్తిస్థాయి పక్కా సమాచారంతో జాబితాను తయారు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా పంచాయతీ కార్యదర్శి స్థాయిలో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించనున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను తయారు చేసి నేరుగా ఎంపీడీవో (మండల పరిషత్ అభివృద్ధి అధికారి) లాగిన్ ద్వారా టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో చేర్చారు.

అయితే, ఇప్పుడు రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీలు, వార్డుల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి వినతులు వస్తున్నందున, దానికి అనుగుణంగా మార్పులు చేయాలని నిర్ణయించారు. దీంతో గ్రామాలు, వార్డుల్లో ఓటర్ల సంఖ్య మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే టీపోల్ వెబ్‌సైట్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేసి, మళ్లీ మొదటి నుంచి ఓటర్ల జాబితా ప్రక్రియను చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఎంపీడీవో లాగిన్‌తో రూపొందించిన ఓటర్ల జాబితాను టీపోల్ సాఫ్ట్‌వేర్ నుంచి తొలగించారు. దాని స్థానంలో కొత్తగా రూపొందించే జాబితాను పంచాయతీ కార్యదర్శి లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయనున్నారు. దానిని ఎంపీడీవో ధ్రువీకరించిన అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి పంపుతారు. ఆపై తుది జాబితా రూపొందుతుంది.

ఈ ఓటర్ల జాబితా రూపకల్పన గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందస్తు సన్నాహాల్లో కీలకమైన ఘట్టం. కొత్త గ్రామ పంచాయతీలు, వార్డుల ఏర్పాటుపై ప్రభుత్వం త్వరలో స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ హైకోర్టు ఇప్పటికే ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించింది. ఇక ఈ ఆదేశాల నేపత్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే విషయంపై సర్కార్ ఫోకస్ పెట్టింది. బిల్లులు ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నందున.. ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం ఆర్డినెన్స్ గవర్నర్ వద్దకు చేరుకోగా.. దానిపై ఆయన న్యాయ సలహా కోరారు. ఈ ప్రక్రియ అనంతరం రాష్ట్రంలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే ఛాన్సుంది.

## కాస్ట్లీ బాటిల్‌లో కల్తీ లిక్కర్, స్పిరిట్‌తో మద్యం తయారీ

**సూర్యాపేట:** జిల్లా రామాపురంలో భారీ నకిలీ మద్యం వెలుగులోకి వచ్చింది. ఎక్సైజ్ పోలీసులు జరిపిన దాడుల్లో 178 బ్రాండ్ల కల్తీ లిక్కర్, రూ. 2 కోట్ల విలువైన స్పిరిట్, ఖాళీ బాటిళ్లు, లేబుళ్లు పట్టుబడ్డాయి. హైదరాబాద్‌లోని కృష్ణపద్మ స్పిరిట్ కంపెనీ నుంచి ముడిసరుకు తెచ్చి, ఏపీ సరిహద్దులోని రైస్ మిల్లులో తయారు చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ముఠాలోని శంకర్‌తో పాటు మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మందుబాబులకు అలర్ట్. మీరు తాగే లిక్కర్ అసలైనది కాకపోవచ్చు. ఎందుకంటే.. కొందరు కల్తీ రాయుళ్లు మద్యాన్ని కూడా కల్తీ చేసేస్తున్నారు. తాజాగా.. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రామాపురంలో భారీగా కల్తీ లిక్కర్ పట్టుబడింది. తెలంగాణ ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్, హుజూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో భారీ నకిలీ మద్యం దొరికింది. ఒరిజినల్ ఖాళీ బాటిళ్లను సేకరించి, అందులో సగం నీళ్లు, కొంత స్పిరిట్, కొంత అసలు మద్యం కలిపి, సీల్ వేసి మార్కెట్లోకి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ కల్తీ ఒకటి రెండు బ్రాండ్లకు పరిమితం కాకుండా, ఏకంగా 178 బ్రాండ్లలో నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు దాదాపు 15 లక్షల రూపాయల విలువైన కల్తీ విస్కీని స్వాధీనం చేసుకున్నారు. ఇది కేవలం ప్యాక్ చేసి సిద్ధంగా ఉన్న కల్తీ మద్యం మాత్రమే. షాకింగ్ విషయం ఏటంటే.. నకిలీ మద్యం తయారీకి



ఉపయోగించే సుమారు రెండు కోట్ల రూపాయల విలువైన స్పిరిట్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, మార్కెట్లోకి పంపడానికి సిద్ధంగా ఉన్న 11 వేల ఖాళీ బాటిళ్లు, వాటికి అతికించాల్సిన 20 లేబుల్ బండిళ్లు కూడా పట్టుబడ్డాయి. ఖరీదైన బ్రాండ్ల సీసాలను సేకరించి, వాటికి సరిపడా మూతలు, లేబుళ్లను అక్రమార్కులు తయారు చేస్తున్నారు. ఆ సీసాలలో స్పిరిట్‌తో తయారుచేసిన కల్తీ మద్యాన్ని నింపి, ఒరిజినల్ తరహా మూతలు బిగిస్తున్నారు. బాటిల్ క్యాప్‌ల నుంచి హోలోగ్రామ్ సీల్స్ వరకు అన్నీ ఒరిజినల్‌ను పోలి ఉండేలా కాపీ చేయడంతో మార్కెట్‌లోకి వచ్చాక ఇది నకిలీ బాటిల్ అని గుర్తించడం చాలా కష్టంగా మారుతోంది. ఈ ముఠా హైదరాబాద్‌లోని కృష్ణపద్మ అనే స్పిరిట్ కంపెనీ నుంచి టన్నుల కొద్దీ స్పిరిట్‌ను కొనుగోలు చేసి, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని ఒక రైస్‌మిల్లులో రహస్యంగా కల్తీ సరుకు తయారు చేస్తున్నారు. ప్రముఖ బ్రాండ్ల పేరుతో ఈ కల్తీ మద్యాన్ని మార్కెట్‌లోకి పంపిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం, రేపల్లె, అమలాపురం వంటి పలు కీలక ప్రాంతాల్లోనూ ఈ ముఠా నకిలీ మద్యాన్ని విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

తాజాగా లిక్కర్ ముఠా గుట్టు రట్టయింది. మేళ్లచెరువు మండల కేంద్రంలో కౌంటర్ విధులు నిర్వహిస్తున్న శంకర్‌తోపాటు మరికొంద రు ఈ ముఠాలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు.

# సంబరాలకు సిద్ధమైన ఆర్టీసీ ఉద్యోగులు

**తెలంగాణ:** 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం సూపర్ సక్సెస్ అయినట్లు ఆర్టీసీ వెల్లడించింది. ఈ పథకం ద్వారా 200 కోట్లకు పైగా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారు. ఈ ప్రయాణాల విలువ రూ. 6,700 కోట్లుగా ఆర్టీసీ అంచనా వేసింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని రేపు (జూలై 23న) రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోలు, బస్ స్టేషన్లలో సంబరాలు జరపనున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొత్త బస్సులు, ముఖ్యంగా ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నారు. సిటీ ఆర్డినరీ, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఫ్రీ బస్ సౌకర్యం కల్పిస్తుండగా.. ఈ పథకంతో



టీజీఎస్‌ఆర్టీసీ అద్భుతమైన మైలురాయిని అధిగమించింది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 200 కోట్లకు పైగా మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. ఈ ఉచిత ప్రయాణాల విలువ అక్షరాలా రూ. 6,700 కోట్లుగా నమోదైందని ఆర్టీసీ ప్రకటించింది.


కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తూ 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రంలోని మహిళలు ఎక్కడికి వెళ్లినా ఉచితంగా ప్రయాణించేలా ఏర్పాట్లు చేసింది. ఆర్టీసీ బస్సు ఎక్కి కేవలం ఆధార్ కార్డు చూపించి జీరో టికెట్ తీసుకుంటే సరిపోతుంది. దాదాపు 18 నెలలుగా ఈ పథకం విజయ వంతంగా కొనసాగుతోంది. ఈ పథకానికి అవసరమైన నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి విడుదల చేస్తూ.. పథకం విజయానికి తోడ్పడుతోంది.

'మహాలక్ష్మి' పథకం 200 కోట్ల ప్రయాణాల మైలురాయిని చేరుకున్న సందర్భంగా.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోల్లో, 341 బస్ స్టేషన్లలో రేపు (జూలై 23) సంబరాలు జరుపనున్నారు. ఈ మేరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు, ఆర్టీసీకి కొత్త బస్సుల అవసరం కూడా పెరిగింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణ ంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

త్వరలో ప్రభుత్వం కొత్త బస్సుల కొనుగోలుకు కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే పలు జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోనూ ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నట్లు చెప్పారు. ఈ పథకం మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించడమే కాకుండా, ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇలాంటి మానసిక రోగులకు చికిత్స అవసరం..





**తెలంగాణ:** సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలనే పిచ్చిలో కొందరు యువకులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారు. తాజాగా ఓ యువకుడు రైలు పట్టాల మధ్య పడుకుని ప్రమాదకర విన్యాసం చేస్తూ వీడియో తీశాడు. దీనిపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ఇది పిచ్చికి పరాకాష్ట అని, ఇలాంటి మానసిక రోగులకు చికిత్స అవసరమని ఆయన అన్నారు. ఇలాంటి చర్యల వల్ల తల్లిదండ్రులు ఎంత క్షోభ అనుభవిస్తారో ఆలోచించాలని హితవు పలికారు.

సోషల్ మీడియా రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది. జాగ్రత్తగా వాడుకుంటే మీ జీవితం పూలబాట అవుతుంది. అలా కాదని పిచ్చిప్రయోగాలు చేస్తే ఒక్కోసారి ప్రాణాలు పోయే పరిస్థితి కూడా తలెత్తుతుంది. ఈ విషయం తెలిసి కూడా కొందరు పిచ్చి వేషాలు వేయడం మానరు. సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించుకోవడం కోసం, వైరల్ కావడం కోసం రకరకాల పిచ్చి వేషాలు వేస్తుంటారు కొందరు. ఈ పిచ్చిలో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యూస్, లైక్ కోసం ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఓ యువకుడు రీల్స్ పిచ్చిలో భాగంగా రైలు పట్టాల మీద పడుకుని ప్రమాదకరమైన స్టంట్ చేస్తూ వీడియో తీశాడు. యువకుడు రైలు పట్టాల మధ్య పడుకున్న సమయంలో వేగంగా వస్తున్న రైలు అతడిపై నుంచి వెళ్తోంది. ట్రైన్ వెళ్లిపోయిన తర్వాత అతను ఏదో సాధించినట్లు నవ్వుతూ పైకి వచ్చి వీడియో రికార్డింగ్ ఆపేశాడు. ఈ వీడియోపై ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందిస్తూ తీవ్రంగా మండిపడ్డారు. ఇది పిచ్చికి పరాకాష్ట.. ఇలాంటి మానసిక రోగులకు చికిత్స అవసరం అంటూ ఘాటుగా విమర్శిస్తూ ట్వీట్ చేశారు. మీ పిచ్చి వల్ల ప్రమాదం జరిగితే.. మిమ్మల్ని కన్న తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభను అనుభవిస్తారో మీకేమైనా తెలుసా.. కాస్త కూడా తెలివి లేదా అంటూ మండిపడ్డారు.

ఈ సందర్భంగా సజ్జనార్.. తన ఎక్స్ ఖాతాలో.. ఈ పోస్టును ఉద్దేశిస్తూ..'పిచ్చికి పరాకాష్ట.. అంటే ఇదే. సోషల్ మీడియాలో ఫేమ్ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండ యువత ఇలాంటి ప్రమాదకర పనులు చేస్తున్నారు. రీల్స్ చేసి ఇప్పటికిప్పుడే ఫేమస్ కావాలనే తాపత్రయమే తప్ప.. ఎలాంటి వీడియోలు చేస్తున్నామనే ఆలోచన కూడా వీరికి లేకపోవడం నిజంగా బాధాకరం. ప్రమాదం జరిగితే తల్లితండ్రులు ఎంతటి క్షోభను అనుభవిస్తారనే సోయి కూడా వీరికి ఉండటం లేదు' అంటూ మండిపడ్డారు. 'సోషల్ మీడియా మత్తులో పడిన ఇలాంటి మానసిక రోగులకు కౌన్సిలింగ్ అత్యవసరం. లేకుంటే వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయని.. వీళ్లు ఇంకా మరెన్నో వెర్రి పనులు చేసే ఆస్కారం ఉంది. వీరిని చూసి మరిందరు ఇదే ట్రేండ్ ఫాలో అయ్యి ప్రాణాల మీదకు తెచ్చుకునే అవకాశం లేకపోలేదు' అంటూ ట్వీట్ చేశారు. సజ్జనార్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రీల్స్ కోసం ఇలాంటి పిచ్చి పనులు అవసరామా.. ప్రాణాలు పోతే పరిస్థితి ఏంటని నెటిజనులు మండిపడుతున్నారు. మీలాంటి వారిని అరెస్ట్ చేస్తే బాగుంటుంది అంటున్నారు.

## నా భర్త సంసారానికి పనికిరాడు విడాకులివ్వండి

**హైదరాబాద్:** తన భర్త సంసారానికి పనికిరాడని తనకు విడాకులు మంజూరు చేయాలని హైదరాబాద్ నగరానికి చెందిన ఓ 38 ఏళ్ల మహిళ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. తన భర్తకు నపుంసకత్వం ఉందని.. లైంగికంగా బలహీనుడని ఇక అతడితో ఉండలేనని పిటిషన్ దాఖలు చేసింది. వివాహానికి ముందు తనకున్న సమస్యను దాచిపెట్టి పెళ్లి చేసుకున్నాడని.. ప్రభుత్వ ఉద్యోగి అయిన అతడి నుంచి విడాకులతో పాటు రూ.90 లక్షల భరణం కూడా ఇప్పించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. అయితే ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. 33 ఏళ్ల భర్తకు నపుంసకత్వం ఉందని నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ విడాకులు మంజూరు చేయడానికి నిరాకరించింది.

నగరానికి చెందిన ఓ మహిళకు 2013లో ప్రభుత్వ ఉద్యోగి అయిన వ్యక్తితో వివాహం జరిగింది. కొన్నాళ్లు బాగానే ఉన్నా.. ఆ తర్వాత ఆమె విడాకులు హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఆ కోర్టు ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. ఫ్యామిలీ కోర్టు తీర్పును సవాలు చేస్తూ.. ఆమె హైకోర్టును ఆశ్రయించింది. తనకు పెళ్లి జరిగిన తర్వాత, హనీమూన్ ట్రిప్స్, ఇద్దరూ కలిసి కొన్ని సంవత్సరాలు యూఎస్‌లో ఉన్నప్పుడు లైంగికంగా కలవలేదని ఆరోపించింది. తన భర్తకు నపుంసకత్వం ఉందని, అతడు లైంగిక జీవితానికి పనికిరాడని పిటిషన్‌లో పేర్కొంది. హిందూ వివాహ చట్టం, 1955 ప్రకారం విడాకులు ఇవ్వాలని కోరింది.

అయితే భార్య వాదనను భర్త విబేధించాడు. భర్త తన మెడికల్ రిపోర్టులను, లైంగికంగా తాను సమర్థుడిని అని రుజువు చేసే సాక్ష్యాలను కోర్టుకు సమర్పించారు. వివాహానికి ముందు, ఆ తర్వాత కూడా తామిద్దరం పరస్పర అంగీకారంతో లైంగిక సంబంధాన్ని కొనసాగించామని ఆయన పేర్కొన్నారు. 2021లో నిర్వహించిన ప్రభుత్వ ఆసుపత్రి పొటెన్సీ పరీక్ష నివేదికను కూడా కోర్టుకు సమర్పించారు, అందులో తనకు లైంగిక సంబంధానికి ఎటువంటి 'అసమర్థత' లేదని స్పష్టంగా ఉందని వాదించాడు. ఇరు పక్షాల వాదనలు విన్న జస్టిస్ మౌష్మి భట్టాచార్య, జస్టిస్ బి.ఆర్. మధుసూదన్ రావులతో కూడిన డివిజన్ బెంచ్ ఆమె కేసును కొట్టేస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. భర్త లైంగిక సామర్థ్యం నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. 2013లో వివాహం జరిగినప్పటి నుండి 2018లో కుటుంబ కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలు చేసే వరకు ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నావని పిటిషన్‌రు హైకోర్టు ప్రశ్నించింది. 2013 నుంచి 2018 వరకు భర్తతో కలిసి నివసించడం, అలాగే ఆమె వాదనలకు మద్దతుగా ఎటువంటి వైద్య లేదా నిపుణుల సాక్ష్యాలు లేకపోవడం వంటి వాటిని కోర్టు ఎత్తి చూపింది. వైద్య లేదా వాస్తవ ఆధారాలు లేకుండా కేవలం ఆరోపణలు మాత్రమే వివాహాన్ని చెల్లనిదిగా ప్రకటించడానికి సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసింది.

# ఫేస్‌ప్యాక్ వేసుకునేప్పుడు.. ఈ తప్పులు చేయకూడదు..!







అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలని.. ప్రతి ఒక్క అమ్మాయి, మహిళ కోరుకుంటుంది. వారి సౌందర్యాన్ని రెట్టింపు చేసుకోవడానికి, వారి అందాన్ని కాపాడుకోవడానికి ఏవేవో స్కిన్‌కేర్ రొటీన్స్ ఫాలో అవుతుంటారు. ఎక్కువమంది ఫాలో అయ్యే.. బ్యూటీకేర్ రొటీన్ ఫేస్ మాస్క్‌లు. వారి అందానికి మెరుగులు పెట్టడానికి.. ఇంట్లో దొరికే సహజమైన వస్తువులతోనే.. ఫేస్‌మాస్క్‌లు వేసేస్తూ ఉంటారు. అయితే, ఫేస్‌మాస్క్ అప్లై చేసేప్పుడు చేసే కొన్ని పొరపాట్ల కారణంగా దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఫేస్‌మాస్క్ అప్లై చేసేప్పుడు చేయకూడని 5 పొరపాట్లు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

ప్యాచ్ టెస్ట్ చేయట్లేదా.. కొత్తరకం ఫేస్‌మాస్క్ అప్లై చేసేముందు.. ప్యాచ్ టెస్ట్ కచ్చితంగా చేసుకోవాలని నిపుణులు అంటున్నారు. ఒకరికి బాగా పనిచేసే.. ఫేస్ ప్యాక్ మరొకరికి పడకపోవచ్చు. దానిలో పదార్థాలు అలెర్జీ, చికాకు కలిగించవచ్చు. మీరు ఫేస్‌ప్యాక్ అప్లై చేసేముందు.. ఏదైనా చిన్న ప్రాంతంలో ప్యాచ్ టెస్ట్ చేయండం మర్చిపోకండి.

రాగులతో ఇలా మాస్క్ వేసుకుంటే.. మొటిమలు మాయం అవుతాయ్, పిగ్మెంటేషన్ కూడా దూరం అవుతుంది..!

తరచూ ఫేస్ ప్యాక్ వేస్తున్నారా.. కొంతమంది అందంగా కనిపించాలని తరచూ ఫేస్ ప్యాక్స్ వేస్తుంటారు. అయితే వీటిని తరచుగా అప్లై చేస్తే.. ఓవర్ ఎక్స్‌ఫోలియేషన్ అవుతుంది. దీనికారణంగా చర్మం పొడిబారుతుంది, కొన్నిసార్లు చికాకు కూడా కలిగిస్తుంది. . ఓవర్-ఎక్స్‌ఫోలియేషన్ చర్మాన్ని సున్నితంగా మారుస్తుంది. అతి ఏదైనా హాని చేస్తుందని గుర్తుంచుకోండి.

ముఖాన్ని శుభ్రం చేసుకోవట్లేదా.. ముఖాన్ని శుభ్రం చేసుకోవట్లేదా.. కొంతమంది ముఖం శుభ్రం చేసుకోకముందే.. ఫేస్‌ప్యాక్ అప్లై చేస్తుంటారు. మీ ముఖాన్ని సరిగ్గా శుభ్రం చేసుకోకుండా.. ప్యాక్ అప్లై చేస్తే.. ఉత్పత్తి సమర్థవంతంగా చర్మంలోని వెళ్లదు. దీనివల్ల ప్యాక్ ఎఫెక్టివ్‌గా పనిచేయదు. ఏదైనా ఫేస్ ప్యాక్ వేసుకునే ముందు మీ ముఖాన్ని శుభ్రం చేసుకోవడం మర్చిపోవద్దు.

ప్యాక్‌వేసి ఎక్కువసేపు ఉంచుకోవద్దు.. కొందరు ఫేస్‌ప్యాక్ అప్లై చేసి.. ఎక్కువసేపు ఆరనిస్తారు. ఇలా చేస్తే.. చర్మానికి చికాకు కలిగిస్తుంది. అంతేకాదు, చర్మంలోని సహజ నూనెలు కోల్పోతాయి. మీరు ప్యాక్ ఆరిన వెంటనే శుభ్రం చేయడం చాలా ముఖ్యం.

# ఈ ఆసనాలు చేస్తే సైనస్ తగ్గుతుందట..








సైనస్ ఉంటే ముక్కు మూసుకుపోయి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉంటుంది. ఇది చలికాలంలో మరింత ఎక్కువ అవుతుంది. అలాంటి సమస్యకి చెక్ పెట్టాలంటే ఈ ఆసనాలు హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి. మన శ్వాసకోశ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే మనం హెల్దీగా ఉండగలం. కానీ, కొన్ని సమస్యల కారణంగా శ్వాస సమస్యలు వస్తాయి. అందులో సైనస్ కూడా ఒకటి. దీని వల్ల ముక్కు రంధ్రాలు మూసుకుపోతాయి. దీనిని అస్సలు తేలిగ్గా తీసుకోలేం. కానీ కొన్ని యోగాసనాలతో సైనస్ సమస్యని పరిష్కరించుకోవచ్చు. సేతు బంధాసనం.. ఇది బ్రిడ్జ్ పోజ్ అని చెప్పొచ్చు. దీనిని చేయడం వల్ల బ్యాక్, కాళ్ళను బలంగా చేస్తుంది. మీ గొంతు, ఛాతీని క్లియర్ చేస్తుంది. మూసుకుపోయిన ముక్కు నుండి ఉపశమనం పొందేలా చేస్తుంది. ప్రాణాయామం.. ఇందులో ముఖ్యంగా అనులోమ, విలోమ, కపాలభాతి వంటి ప్రాణాయామ పద్ధతులు నాసికా రంధ్రాలను క్లియర్ చేస్తాయి. వీటిని చేయడం వల్ల శ్వాస ప్రక్రియలు నియంత్రిస్తాయి. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది. దీంతో ఆక్సిజన్ సరఫరా పెరిగి సమస్యకి పరిష్కారం లభిస్తుంది. భుజంగాసన.. ఇది మీ ఛాతీని ఎక్స్‌పాండ్ చేసి సైనస్ సమస్యల నుండి రిలాక్స్ చేసే నాగు పాము భంగిమ. దీనిని చేయడం వల్ల ఛాతీ ఎక్స్‌పాండ్ అయి వెన్నెముకని బలంగా చేసి వెన్నునొప్పిని కూడా తగ్గిస్తుంది. ఛాతీలో ఇబ్బంది తగ్గడంతో సైనస్ కూడాతగ్గుతుంది. పర్వతాసన.. ముక్కు రంధ్రాలను క్లియర్ చేసి మంట నుండి రిలాక్స్ చేసేలా చేస్తుంది. దీనిని చేయడం వల్ల భుజాలు, చేతులని చాచి చేయొచ్చు. దీని వల్ల సైనస్ వంటి సమస్యలు దూరమవుతాయి.

# తిన్న తర్వాత సోడా కూల్‌డ్రింక్స్ తాగుతున్నారా..





చాలా మందికి బిర్యానీ తింటూ కూల్ డ్రింక్స్ తాగడం అలవాటు. దీని వల్ల కడుపులో హాయిగా ఉందనుకుంటారు. కానీ, కొన్ని సమస్యలున్నాయి. అవేంటో తెలుసుకోండి. తిన్న తర్వాత సోడా, కూల్‌డ్రింక్స్ తాగుతున్నారా.. జాగ్రత్త.. ఏదైనా హెవీగా భోజనం చేసినప్పుడు చాలా మంది సోడా, కూల్ డ్రింక్స్ తాగడం చేస్తుంటారు. లేదా నిమ్మకాయ సోడాలో ఉప్పు కలిపి తాగుతారు. దీని వల్ల కడుపులో కాస్తా రిలాక్స్‌గా ఉన్నట్లుగా త్రేన్పులు వస్తాయి. అప్పటికప్పుడు రిలాక్స్‌గా ఫీల్ అవుతారు. కానీ, తర్వాత కొన్ని సమస్యలొస్తాయని చెబుతున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకోండి.

సోడా తాగితే.. భోజనం చేశాక సోడా తాగితే ఎక్కువగా తినాలనే కోరికలు తగ్గుతాయి. వెంటనే కడుపులో పేరుకుపోయిన గ్యాస్ పోయినట్టుగా అనిపిస్తుంది. కానీ, ఇది తాత్కాలికంగా మాత్రమే. తిన్నాక సోడా తాగితే గ్యాస్ పెరుగుతుంది. దీంతో పాటు చాలా సమస్యలొస్తాయి.

గ్యాస్ పెరిగితే.. కడుపులో గ్యాస్ పెరిగితే పొట్ట నొప్పి వస్తుంది. ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా అనిపిస్తుంది. దీంతో కూర్చోలేరు, నించోలేరు ఇబ్బందిగా ఉంటుంది. అదే విధంగా కొంతమందికి గుండెల్లో మంట, మలబద్ధకం, త్రేన్పులు, వెన్నునొప్పి వీటితో పాటు ఛాతీ నొప్పి కూడా వచ్చే అవకాశం ఉంది.





జ్యూసెస్.. ఇక కొంతమంది, అదే విధంగా తిన్న తర్వాత జ్యూస్ కూడా తాగుతారు. ఇలా తాగడం కూడా అస్సలు మంచిది కాదు. దీని వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. దీంతో బరువు కూడా పెరుగుతారు. అందుకే, వీటిని తాగకపోవడమే మంచిది. ఏం తాగాలి.. తిన్న తర్వాత వేడినీరు తాగడం మంచిది. భోజనం మధ్యలో నీరు తాగొద్దు. తిన్న తర్వాత కాసేపటికి గోరువెచ్చని నీరు, జీలకర్ర నీరు తాగడం మంచిది. మీకు ఏం తాగడం ఇష్టం లేకపోతే కాసేపటి తర్వాత గోరువెచ్చని నీరు తాగండి. దీంతో తిన్న ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. వీలైతే హెర్బల్ టీలు కూడా తాగొచ్చు.

# గుండెకు చాలా మంచిది



ఫైబర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బరువును కంట్రోల్‌లో ఉంచడంలో, జీర్ణక్రియ సక్రమంగా పనిచేయడానికి ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుంది. రోజూవారీ ప్రతిపాదించిన ఫైబర్ తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది, ఫైబర్స్ గట్ మైక్రోబయోటాను మీడియేట్ చేస్తుంది, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో రకరకాలు ఉండొచ్చు గానీ ప్రధానమైనవి నీటిలో కరిగేది, నీటిలో కరగనిది. నీటిలో కరిగే పీచు మృదువుగా ఉంటుంది. నీటిని పీల్చుకోవటం ద్వారా ఇది మల పదార్థం ఏర్పడేలా, విసర్జన సాఫీగా సాగేలా చేస్తుంది. ఇది కూరగాయలు, విత్తనాలు, దంపుడు బియ్యం, బార్లీ, ఓట్స్ వంటి వాటితో లభిస్తుంది. నీటిలో కరగని ఫైబర్ కాస్త గట్టిగా ఉంటుంది. లివర్ నుంచి పేగుల్లోకి వచ్చే కొలెస్ట్రాల్‌ను ఇది పట్టేసుకుంటుంది. ఇది విత్తనాలు, పండ్లు, పప్పుధాన్యాలతో లభిస్తుంది. ఫైబర్ రిచ్ ఫుడ్స్ మన డైట్‌లో తీసుకుంటే.. ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చో నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గుతారు.. ఫైబర్స్ మన శరీరంలోని గట్ బాక్టీరియాను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. ఫైబర్ రిచ్ డైట్ మన కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. త్వరగా ఆకలి వేయకుండా నియంత్రిస్తుంది.. తద్వారా అతిగా తినకుండా కంట్రోల్‌లో ఉంటాం. ఫైబర్ శరీరంలోని కొవ్వు త్వరగా కరగడానికి సహాయపడు తుంది, బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచుతుంది.. ఫైబర్ రిచ్ డైట్ బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది, ఎందుకంటే మానవ శరీరం ఫైబర్‌ను గ్రహించుకోలేదు, విచ్ఛిన్న చేయలేదు. ఇది కార్బోహైడ్రేట్ల కారణంగా.. రక్తంలో పెరిగే చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుతుంది. ఆహారం త్వరగా జీర్ణం కాకుండా చూస్తూ రక్తంలోకి గ్లూకోజు నెమ్మదిగా వెళ్లేలా చేస్తుంది. వైద్యులు సాధారణంగా 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు ప్రతిరోజూ 22-35 గ్రాముల ఫైబర్ తీసుకోవాలని సిఫార్సు చేస్తారు.





గుండెకు మంచిది.. ఫైబర్ రిచ్ డైట్ గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. నీటిలో కరగని ఫైబర్ . లివర్ నుంచి పేగుల్లోకి వచ్చే కొలెస్ట్రాల్‌ను ఇది పట్టేసుకుంటుంది. దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి. కరగని ఫైబర్ ఎక్కువగా.. విత్తనాలు, పండ్లు, పప్పుధాన్యాలతో లభిస్తుంది. ఫైబర్ రిచ్ ఫుడ్స్ హైపర్‌టెన్షన్‌ను, శరీరంలోని ఇన్ఫ్లమేషన్‌ను కూడా కంట్రోల్‌లో ఉంచుతుంది.

క్యాన్సర్ రిస్క్ తగ్గిస్తుంది.. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, చిక్కుళ్లలో లభించే ఫైబర్ కొన్ని రకాల క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తాయని నిపుణులు అంటున్నారు. నీటిలో కరిగే పీచు మృదువుగా ఉంటుంది. నీటిని పీల్చుకోవటం ద్వారా ఇది మల పదార్థం ఏర్పడేలా, విసర్జన సాఫీగా సాగేలా చేస్తుంది. రెగ్యులర్ ప్రేగు కదలికలు సంభావ్య హానికరమైన పదార్థాలు పెద్దప్రేగు లైనింగ్‌తో సంబంధంలో ఉండే సమయాన్ని తగ్గిస్తాయి, ఇది కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎంత తీసుకోవాలి.. ఫైబర్ అవసరం జీర్ణ వ్యవస్థ పరిమాణాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. పెద్దగా ఉంటే ఎక్కువ ఫైబర్ కావాలి. ఉదాహరణకు- 50 కిలోల బరువు ఉన్నవారికి రోజుకు 20-25 గ్రాములు అవసరం. అదే 75 కిలోల బరువుంటే సుమారు 30-35 గ్రాములు కావాలి.




ఒకప్పుడు బట్టలు టైట్‌గా ఉంటే ఫ్యాషన్. కానీ, ఎప్పటికప్పుడు ట్రెండ్స్ మారుతుంటాయి. కాబట్టి, ప్రజెంట్ కాస్తా లూజ్‌గా ఉండే డ్రెస్సెస్‌ని కూడా ట్రై చేస్తున్నారు. వదులైన బట్టలు వేసుకుంటే స్టైల్‌తో పాటు ఈ లాభాలు కూడా.. నిజానికి లూజ్‌గా ఉండే బట్టలు అంటే అంతగా ఇష్టపడరు. దీని వల్ల తమ లుక్స్ అతగా బాగోవని అనుకునేవారు. కానీ, ఇప్పుడు చాలా మంది కంఫర్ట్‌నెస్‌ని కోరుకుంటారు. సెలబ్రిటీలు సైతం వదులుగా ఉండే బట్టల్ని స్టైల్ చేసి పోజులివ్వడంతో చాలా మంది లూజ్‌గా ఉండే బట్టల్ని వేసుకుంటున్నారు. మీరు ఇందుకోసం మళ్ళీ షాపింగ్ చేయాల్సిన అవసరం లేదు. మీ ఇంట్లో వారి బట్టల్ని స్టైల్ చేయొచ్చు. అందుకోసం ఏ టిప్స్ పాటించాలో

# వదులైన బట్టలు వేసుకుంటే..

చూద్దాం. లూజ్ ప్యాంట్స్.. లూజ్ ప్యాట్స్‌ని కాస్తా టైట్‌గా ఉండే టాప్స్, ఫన్నీ షర్ట్స్, క్రాప్ టాప్‌తో మ్యాచ్ చెయొచ్చు. అదే విధంగా.. లూజ్‌గా ఉన్న ప్యాట్స్ వేసుకున్నప్పుడు వాటిపైకి షూస్ వేసుకుంటే మంచి లుక్ వస్తుంది.

కుర్తీ.. మీరు లూజ్‌గా ఉండే కుర్తీలు కూడా వేసుకోవచ్చు. ఈ కుర్తీని స్టైల్ చేసే ముందు మీకు సెట్ అవుతుందో లేదో తెలుసుకోండి. అదే విధంగా, కొన్ని మెటీరియల్స్ కుర్తీలు, కాటన్ కుర్తీలు అందరికీ సెట్ కాకపోవచ్చు. కాబట్టి, కుర్తీని సెలక్ట్ చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు.



బీచ్ లుక్.. లూజ్‌గా ఉన్న డ్రెస్సెస్ మంచి బీచ్ లుక్‌ని కూడా ఇస్తాయి. ఇందుకోసం లూజ్ మ్యాక్సీ డ్రెస్ వేసుకోవచ్చు. పార్టీ లుక్ ఇవ్వడానికి బెల్ట్, బూట్స్‌తో దీనిని పేర్ అప్ చేయొచ్చు. అదే విధంగా, షార్ట్ ప్యాంట్, లూజ్ టీ షర్ట్స్, మినీ టిప్స్, షర్ట్స్ స్టైల్ చేయొచ్చు.




లూజ్ టీ షర్ట్.. లూజ్ టీ షర్ట్ ఎంత కంఫర్ట్‌గా ఉంటుందో అంతే ఫ్యాషన్‌గా కూడా కనిపిస్తుంది. వదులుగా ఉండే టీ షర్ట్స్ క్యాజువల్ లుక్‌ని ఇస్తుంది. వీటికి మ్యాచింగ్‌గా మీరు చక్కని షార్ట్స్ వేసుకోవచ్చు. బ్యాగీ ప్యాంట్స్‌కి కూడా బానే ఉంటాయి. కార్గో ప్యాంట్స్ కూడా చక్కని ఎలివేషన్‌ని ఇస్తాయి.

లూజ్ షర్ట్.. మీరు లూజ్‌గా ఉండే బట్టలు వేసుకోవాలంటే ముందుగా మీకు లూజ్ షర్ట్ ఉండాలి. అయితే, వాటిని మీరు వేసుకునేందుకు లోపలై సరైన ఇన్నర్స్ వేసుకోవాలి. అది మీ బాడీని మొత్తం కవర్ చేయాలి. తర్వాత ఈ షర్ట్‌ని స్కిన్నీ ఫిట్ జీన్స్, స్కర్ట్స్, ప్యాంట్స్‌తో పేర్ అప్ చేయొచ్చు. వీటిని ఎలివేట్ చేయాలంటే మంచి బెల్ట్, బూట్స్ వేసుకోండి. మీరు లూజ్‌గా ఉండే బట్టలు వేసుకున్నప్పుడు కొన్ని విషయాలను గుర్తుపెట్టుకోవాలి. మంచి కలర్ కాంబినేషన్స్ ఫాలో అవ్వాలి. ఎంచుకున్న డ్రెస్సెస్‌కి సరిపోయే షూ, యాక్సెసరీస్ తీసుకోవాలి. మేకప్ కూడా డీసెంట్‌గా ఉండాలి.

లూజ్ బట్టలతో లాభాలు.. టైట్‌గా ఉండే డ్రెస్సెస్ కంటే లూజ్‌గా ఉండే బట్టలు వేస్తే చర్మ సమస్యలు రావు. చర్మానికి వెంటిలేషన్ అందుతుంది. చెమట ఎక్కువగా రాదు. దీంతో చెమట వాసన రాదు. ఇబ్బంది కూడా ఉండదు.

# పెళ్లికి ముందు ఈ పనులు చేయాల్సిందే..








పెళ్ళి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చాలా ముఖ్యం. ఈ ఘట్టం ముందు కొన్ని పనులు చేయడం చాలా ముఖ్యం. అవేంటో తెలుసుకోండి.

ప్రతి జీవితంలోనూ ఒకరు తోడుగా ఉండడం చాలా ముఖ్యం. అప్పుడే జీవితం ఆనందమయమవుతుంది. అందుకే ఓ వయసు వచ్చాక తల్లీదండ్రులు పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేస్తారు. అయితే, పెళ్ళి చేసే ముందు కొన్ని పనులు తప్పకుండా చేయడం మంచిది. అలాంటి పనులతో జీవితాన్ని హ్యాపీగా ఆస్వాదించొచ్చు. అవేంటో తెలుసుకోండి.

సెల్ఫ్ లవ్.. మిమ్మల్ని మీరు ఎంత లవ్ చేసుకుంటారో మీ చుట్టూ ఉన్నవారు కూడా మిమ్మల్ని అంత లవ్ చేస్తారు. కాబట్టి, ఎక్కువగా మిమ్మల్ని మీరు ప్రేమించుకునేలా చూడండి. అడ్వెంచర్స్.. లైఫ్‌లో ప్రతి ఒక్క విషయాన్ని ఆస్వాదించాలి. అందుకోసం మీరు మీ కంఫర్ట్ జోన్‌లోనే వీలైనన్నీ అడ్వెంచర్స్ చేయడం చాలా ముఖ్యం. అందుకే అడ్వెంచర్స్ చేసేయండి. డబ్బు.. అదే విధంగా మ్యారేజ్‌కి ముందు మీకంటూ కొద్దిగా మనీ సేవ్ చేసుకోవడం చాలా ముఖ్యం. సెల్ఫ్ ఇండిపెండెంట్‌గా ఉండేందుకు జాబ్, బిజినెస్ చేయడం చాలా ముఖ్యం. దీని వల్ల మీకంటూ కాస్తా డబ్బు ఉంటుంది.

సామాజిక సేవ.. వీలైనంత వరకూ కొద్దిగానైనా సాజిక సేవకి టైమ్ కేటాయించండి. దీని కోసం మీరు వాలంటీర్‌గా కూడా పనిచేయొచ్చు. అది ఏ రూపంగా అయినా సరే సామాజిక సేవ చేయడం ముఖ్యమని గుర్తుపెట్టుకోండి. టైమ్ స్పెండ్.. అదే విధంగా, స్నేహితులు, బంధువులతో వీలైనంతత వరకూ ఎక్కువ సమయాన్ని గడపండి. వీలైతే మ్యారేజ్ అయ్యాక కూడా ఈ రిలేషన్‌ని కంటిన్యూ చేయండి. దీని వల్ల మీ రిలేషన్ గ్యాప్ రాకుండా ఉంటుంది. ఇష్టపడే పనులు.. అదే విధంగా, మీకు ఇష్టమైన పనులు చేయండి. దీని వల్ల ప్రతి దాన్ని ఆస్వాదించిన వారవుతారు. అదే విధంగా ఏదైనా నేర్చుకోవడానికి ట్రై చేయండి. చాలా కళలు ఉన్నాయి. కొత్త విషయాలు నేర్చుకోండి. ఇవి జీవితంలో ఏదైనా టైమ్‌లో హెల్ప్ అవుతాయి. హెల్త్.. ఈ టైమ్‌లో మీ హెల్త్‌పై కూడా కేర్ తీసుకోండి. మానసిక, శారీరకంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోండి. మంచి హెల్దీ ఫుడ్ తీసుకోండి. రెగ్యులర్‌గా వర్కౌట్ చేయండి. హ్యాపీగా నిద్రపోండి. సింగిల్ జర్నీ.. జీవితంలో ఒంటరిగా ప్రయాణించడం అనేది ప్రతి ఒక్కరూ కూడా ఎక్స్‌పీరియెన్స్ చేయాలి. దీని వల్ల ఎలాంటి పరిస్థితినైనా ఒంటరిగా ఎదుర్కొనే శక్తి మీకు అందిస్తాయి. అందుకే కచ్చితంగా ఒంటరిగా ప్రయాణాలు చేసి చూడండి. అదే చాలా వరకూ హ్యాపీనెస్ ఇస్తుంది.



'హరిహర వీరమల్లు' ప్రెస్‌మీట్‌లో ఏఎం రత్నం గురించి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ భావోద్వేగానికి గురయ్యారు. ఏఎం రత్నం లాంటి నిర్మాతల్ని కాపాడుకోవాలని.. ఆయన చేసిన సేవలకు గాను ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ పదవికి ప్రతిపాదించానని తెలిపారు. హీరోయిన్ నిధి అగర్వాల్‌ని

# నా సినిమాలకి పెద్దగా బిజినెస్ జరగదు..

చూస్తుంటే తనకు సిగ్గేస్తోందని.. ఆ అమ్మాయి ఒంటరిగా ప్రమోషన్లు చేస్తూ సినిమా కోసం ఎంతో కష్టపడుతోందన్నారు. ఇంత మంచి సినిమాని అనాథలా వదిలేయకూడదన్న భావనతోనే తాను కూడా మీడియా ముందుకొచ్చానన్నారు.

చిన్న మేకప్ మెన్ స్థాయి నుంచి స్టార్ హీరోలతో సినిమాలు నిర్మించే స్థాయికి ఎదిగిన ఏఎం రత్నం లాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి చాలా అవసరమని.. అలాంటి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. ' హరిహర వీరమల్లు ' సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఏఎం రత్నంపై ప్రశంసలు కురిపించారు. అంతేకాదు ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ పదవికి ఆయన్ని ప్రతిపాదించినట్లు చెప్పారు.

'సినీ ఇండస్ట్రీలో నిర్మాతలు కనుమరుగవుతున్న ఇలాంటి తరుణంలో ఏఎం రత్నం లాంటి నిర్మాత కోసం మీడియా ముందుకు రావాలనిపించింది. రాష్ట్రాన్ని గాలికొదిలేసి సినిమాలు చేసుకుంటున్నాడని ప్రత్యర్థులు నన్ను తిడుతున్నా పట్టించుకోకుండా ఆయన కోసం ఇక్కడికి వచ్చాను. ఎందుకంటే సినిమా నాకు అన్నం పెట్టింది. సినిమా అంటే నాకు ప్రాణంతో సమానం. నేను దేశవ్యాప్తంగా చాలామందికి తెలుసేమో గానీ చాలామంది హీరోలతో పోల్చుకుంటే నేను చాలా తక్కువ. నా మార్కెట్ కూడా తక్కువే. వాళ్లకి జరిగినట్లుగా నా సినిమాలకి బిజినెస్ జరగదు. వాళ్లకి వచ్చినట్లుగా నాకు కలెక్షన్లు రావు. నేను ఎప్పుడూ సమాజం మీద, పాలిటిక్స్ మీద ఫోకస్ పెట్టాను గానీ.. సినిమాల మీద పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. సినిమా ఇండస్ట్రీలో నాలాంటి హీరోలు ఎంతోమంది ఉన్నారు. వాళ్లలో నేను ఒక్కడి అంతే. సంవత్సరంలో నా సినిమా ఒక్క గురువారమో, శుక్రవారమో రిలీజ్ అవుతుంది. ఇది అందరి పరిశ్రమ.. అందరూ రావాలి అని కోరుకునేవాడిని. అందుకే రత్నం లాంటి నిర్మాతని కాపాడుకోవాలనుకుని ఈ సినిమాని నా భుజాల మీదికి తీసుకున్నా'

'హరిహర వీరమల్లు' కోసం యూనిట్ అంతా కొద్దిరోజులుగా నిద్ర మానుకుని మరీ కష్టపడుతున్నారు. హీరోయిన్ నిధి అగర్వాల్‌ని చూస్తే నాకు బాధతో పాటు సిగ్గనిపించింది. తన కెరీర్ చూసుకోవాల్సిన అమ్మాయి పాపం ఈ సినిమా ప్రమోషన్ల కోసం ఎంతో కష్టపడుతోంది. అందుకే ఈ సినిమా కోసం నేను కూడా ఉన్నానని చెప్పడానికే ఈరోజు బయటికి వచ్చా. కోట్లాది మంది ప్రజలకు అండగా ఉండేవాడిని, దేశంలోని సమస్యలపై స్పందించేవాడిని.. అలాంటిది నా సినిమాని అలా ఎలా వదిలేస్తాను. ఈ సినిమాని అనాథలా వదిలేయలేదు.. నేనున్నా అని చెప్పడానికి ఇక్కడికి వచ్చా'

' ఒక మేకప్‌మెన్ స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగి ఈరోజు అగ్ర నిర్మాతగా ఎదిగిన ఏఎం రత్నం గారు అందరికీ ఆదర్శం. ఆయన ఎంత ఎదిగినా మౌనంగానే ఉంటారు. ఆ మౌనం ఒక్కోసారి నన్ను అసహనానికి గురిచేస్తుంటుంది. ముఖ్యంగా 'హరిహర వీరమల్లు' చిత్రం కోసం ఆయన పడిన కష్టం చూసి నేను చలించిపోయాను. మళ్లీ ఆయనతో మళ్లీ సినిమాలు చేస్తానో లేదో గానీ ఆయన చేసిన సేవలకు గాను ఒక్కటి మాత్రం చేయాలని నిర్ణయించుకున్నా. ముఖ్యమంత్రి గారితో మాట్లాడి ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌కి ఛైర్మన్‌గా ఏఎం రత్నం గారిని ప్రతిపాదించాను. ఆయన నా సినిమా నిర్మాతని కాదు.. చాలామంది హీరోలతో సినిమాలు తీశారు. సినిమాల కోసం ఆయన పడే కష్టాన్ని చూసి ఆ పదవికి అర్హుడని అనిపించింది. అయితే అది జరుగుతుందో లేదో చెప్పలేను. ఎందుకంటే అన్నీ పనులు నా చేతిలో ఉండవు. సినీ ఇండస్ట్రీకి సంబంధించి టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ లాంటి పదాలు వాడటం నాకు ఇష్టం లేదు. హాలీవుడ్ నుంచి ఇలాంటి పదాలు కాదు.. వాళ్లకున్న ప్రొఫెషనలిజం, కమిట్‌మెంట్ నేర్చుకోవాలి, ప్రొడక్షన్ డిజైనింగ్ ఎబిలిటీని తీసుకురాగలగాలి' అన్నారు పవన్ కళ్యాణ్.



# హాలీవుడ్ హీరోలా చరణ్..

రామ్‌చరణ్ తన తాజా చిత్రం 'పెద్ది' కోసం బాడీ లాంగ్వేజ్, ఫిజిక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా ట్రైనింగ్ సమయంలో తీసిన ఫోటోను చెర్రీ షేర్ చేస్తూ, %Changeover for @peddi-movie begins%!! అంటూ క్యాప్షన్ ఇచ్చారు. గుబురు గడ్డం, రఫ్ హెయిర్‌స్టైల్, సిక్స్ ప్యాక్‌తో చరణ్ లుక్‌ను చూసిన ఫ్యాన్స్ తెగ పొగడ్తలతో రెచ్చిపోతున్నారు. "మాకు కావాల్సింది ఇదే", "ఊర మాస్ లుక్", "బాక్సాఫీస్ బద్దలవుతుంది" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. చెర్రీ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న ఈ సినిమా విడుదల కానుంది.

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ ప్రస్తుతం ' పెద్ది ' మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. పీరియాడికల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సుకుమార్ శిష్యుడు సానా బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'గేమ్ ఛేంజర్' లాంటి డిజాస్టర్ తర్వాత చరణ్ నటిస్తోన్న చిత్రం కావడంతో మెగా ఫ్యాన్స్ దీనిపై చాలా ఆశలే పెట్టుకున్నారు. ఇందులో చెర్రీ రగ్గడ్ లుక్‌లో పక్కా మాస్ అవతార్‌లో కనిపిస్తుండటం ఆకట్టుకుంటోంది. ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌లో సినిమాలో అంచనాల్ని భారీగా పెంచేశాయి. ముఖ్యంగా గ్లింప్స్ చివర్లో చెర్రీ కొట్టే ఐకానిక్ షాట్ తెగ వైరల్ అయింది. ఇప్పటికే పలు షెడ్యూళ్లు షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం శరవేగంగా తెరకెక్కుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన షెడ్యూల్‌లో ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్ తెరకెక్కించినట్లు టాక్. దీనికోసం చరణ్ డూప్ లేకుండా నటించాడని ప్రచారం జరిగింది. ఈ సీన్ సినిమాకే హైలెట్‌గా ఉండేలా బుచ్చిబాబు ప్లాన్ చేశాడట. ఇలా 'పెద్ది' గురించి వచ్చే ప్రతి అప్‌డేట్ ఫ్యాన్స్‌ని ఖుషీ చేస్తోంది.

ఆ ఫిక్‌లో చెర్రీ గుబురు గడ్డం, రఫ్ హెయిర్‌స్టైల్, సిక్స్ ప్యాక్ బాడీతో హాలీవుడ్ హీరోలా కనిపిస్తున్నారు. ఈ ఫోటో చూసిన మెగా ఫ్యాన్స్ పూనకాలతో ఊగిపోతు న్నారు. మాకు కావాల్సింది ఇది కదా అన్నా అంటూ కామెంట్లతో రెచ్చిపోతున్నారు. బాక్సాఫీస్ బద్దలంతే, ఊర మాస్ లుక్.. అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మొత్తానికి చరణ్ షేర్ చేసిన ఈ ఫోటో సినిమాపై అంచనాలను ఇంకా పెంచేసింది. ఈ సినిమా రామ్‌చరణ్ పుట్టినరోజు కానుకగా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

### పెద్ది ఫస్ట్ షాట్.. అదిరిన రామ్ చరణ్ యాస

'పెద్ది' తర్వాత పవన్ కళ్యాణ్ సుకుమార్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించనున్నారు. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన 'రంగస్థలం' ఎంత పెద్ద హిట్టు అయిందో తెలిసిందే. దీంతో తాజా చిత్రం ఇంకా సెట్స్ మీదికి వెళ్లకుండానే అంచనాలు పెరిగిపోయాయి. ఈ రెండు చిత్రాల తర్వాత చరణ్ వరుస ప్రాజెక్టులు లైన్లో పెట్టే పనిలో ఉన్నారట. అందుకే అనేక కథలు వింటున్నారని, నచ్చిన వాటిని మార్క్ చేసుకుని మళ్లీ కలుద్దామని దర్శకులకు చెబుతున్నారట. ఆయన స్పీడ్ చూస్తుంటే 'పెద్ది' రిలీజ్ టైమ్‌కి కనీసం అరడజన సినిమాలైనా లైన్లో పెట్టేలా ఉన్నారని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. సినిమాల విషయంలో చెర్రీ స్పీడ్ పెంచాడని తెలియడంతో ఆయన ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు. ఇకపై తమ హీరో నుంచి ఏడాదికి కనీసం రెండు సినిమాలైనా వస్తాయని అంటున్నారు.

# ఈడీ నోటీసులు

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ వేగవంతం చేసింది. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించినందుకు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, మంచు లక్ష్మి వంటి పలువురు సినీ ప్రముఖులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ముమ్మరం చేసింది. బెట్టింగ్ యాప్స్ ని ప్రమోట్ చేసిన పలువురు సినీ ప్రముఖులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొనబడిన విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, మంచులక్ష్మికి నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంలో విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశించింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో రానా దగ్గుబాటిని జూలై 23న, ప్రకాష్ రాజ్ ని జూలై 30న ఈడీ అధికారులు విచారించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. విజయ్ దేవరకొండ ఆగస్టు 6న, మంచు లక్ష్మి ఆగస్టు 13న విచారణకు హాజరవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్స్ కు సంబంధించి సినీ ప్రముఖులను ఈడీ విచారించనుంది.



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' చిత్రం జూలై 24న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ ఫిక్షనల్ హిస్టారికల్ యాక్షన్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, అదే సమయంలో హెూంబలే ఫిల్మ్స్ నిర్మించిన 'మహావతార్: నరసింహ' అనే యానిమేషన్ చిత్రం కూడా జూలై 25న విడుదల కానుంది. ఓటీటీలో 'సర్జమీన్', 'మండల మర్డర్స్' సినిమాలు స్ట్రీమింగ్ కానున్నాయి.

పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే టాలీవుడ్ లో సందడి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ట్రేడ్ వర్గాల్లో అంచనాలు, థియేటర్ల దగ్గర ఫ్యాన్స్ చేసే హంగామా మామూలుగా ఉండదు. రెండేళ్ల తర్వాత ఆయన్నుంచి రాబోతున్న సినిమా 'హరి హర వీరమల్లు'. దాదాపు ఐదున్నరేళ్లుగా వార్తల్లో ఉన్న ఈ చిత్రం.. ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అభిమానుల ఎదురు చూపులకు తెర దించుతూ జులై 24న పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కాబోతోంది. ఇదొక ఫిక్షనల్ హిస్టారికల్ యాక్షన్ మూవీ. తెలుగుతో పాటుగా హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు.

### ఐదేళ్లకు వీరమల్లు విడుదల..

'హరి హర వీరమల్లు' సినిమాకి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఏఎం రత్నం భారీ బడ్జెట్ తో నిర్మించారు. ఇందులో పవన్ కళ్యాణ్ కు జోడీగా నిధి అగర్వాల్ నటించారు. బాబీ డియోల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, నాజర్, సత్యరాజ్, రఘుబాబు, వెన్నెల కిషోర్, కబీర్ సింగ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఎంఎం కీరవాణి సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి జ్ఞాన శేఖర్, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ నిర్వహించారు. ధర్మ పరిరక్షణ కోసం పోరాడే ఓ యోధుడి కథను సినిమాలో చూపించనున్నారు.

# 3 ఏళ్ల హార్డ్ వర్క్.. 250 రోజులు షూటింగ్..

కన్నడ హీరో రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కాంతార: చాప్టర్–1'. 2022లో బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ గా నిలిచిన 'కాంతార' చిత్రానికి ప్రీక్వెల్ ఇది. హెూంబలే ఫిల్మ్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో తీస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. తాజాగా షూటింగ్ కంప్లీట్ అయిందనే విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం మేకింగ్ వీడియోని రిలీజ్ చేశారు. కాంతార వరల్డ్ ను ఎలా క్రియేట్ చేశారనేది ఈ వీడియోలో చూపించారు. మూడేళ్లు కష్టపడి, 250 రోజులు షూటింగ్ చేసి ఈ సినిమాని రూపొందించినట్లు తెలిపారు. ఇది కేవలం ఒక సినిమా కాదని, ఇదొక పవర్ అని పేర్కొన్నారు. అక్టోబర్ 2వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి క్లారిటీ ఇచ్చారు.





# వీరమల్లుకు పోటీగా

ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. గతంలో పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే ఒక వారం ముందు, రెండు వారాల తర్వాత మరో సినిమాని రిలీజ్ చేయడానికి ఎవరూ సాహసించేవారు కాదు. కానీ ఇప్పుడు 'హరి హర వీరమల్లు' సినిమాతో పాటుగా మరో చిత్రం థియేటర్లలోకి వస్తోంది. హెూంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన 'మహావతార్: నరసింహ' అనే యానిమేషన్ మూవీ రిలీజుకు రెడీ అయింది. ఈ చిత్రం జులై 25న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. 2డీ, 3డీ వెర్షనలో ఈ మూవీ అలరించనుంది.

### నాలుగేళ్ల కష్టం..

మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా 'మహావతార్: నరసింహ' చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రహ్లాదుడి చరిత్ర.. మహా విష్ణువుకు, రాక్షస రాజు హిరణ్యకశిపునికి మధ్య జరిగిన యుద్ధాన్ని ఈ సినిమాలో చూపించనున్నారు. నాలుగేళ్లపాటు కష్టపడి ఈ సినిమాని రూపొందినట్లు మేకర్స్ చెబుతున్నారు. దీనికి అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. 'కాంతార', 'కేజీయఫ్', 'సలార్' వంటి చిత్రాలతో హెూంబలే ఫిల్మ్స్ తెలుగులోనూ మంచి విజయాలను అందుకుంది. ఇటీవల కాలంలో పురాణగాథలకు మంచి ఆదరణ దక్కుతోంది కాబట్టి, ' మహావతార్ నరసింహ ' మూవీ సక్సెస్ సాధిస్తుందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ మెటీరియల్ ఆకట్టుకుంది. థియేటర్లలో ఈ వారం రెండు సినిమాలే రిలీజ్ అవుతుండగా.. మూవీ లవర్స్ కోసం ఓటీటీలో మరికొన్ని కొత్త చిత్రాలు స్ట్రీమింగ్ కు రెడీ అవుతున్నాయి. 'సలార్' ఫేమ్ పృథ్వీరాజ్ సుకుమారన్, కాజోల్, సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'సర్జమీన్' అనే చిత్రం జులై 25న జియో హాట్‌స్టార్ వేదికగా విడుదల కానుంది. అలానే బాలీవుడ్ బ్యూటీ వాణీ కపూర్ కీలక పాత్రలో నటించిన 'మండల మర్డర్స్' అనే క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ అదే రోజున నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

# నేనూ మీ సినిమాని.. 'ఇక బతకలేను చావే శరణ్యం'

నేనూ మీ సిని మాని.. బాధాతప్త హృదయంతో కొనఊపిరితో రాస్తున్న లేఖ ఇది. చిమ్మ చీకటిలో బొమ్మనై అలరించిన నాకు ఇప్పుడు ఆ చీకటంటే భయం కలుగుతుంది. ఆ శబ్దాలు వింటుంటే వణుకొస్తుంది. లైట్లన్నీ ఆర్పేస్తేనే కానీ.. బొమ్మపడేది కాదు. కానీ ఇప్పుడు ఆ లైట్లు ఆర్పేస్తుంటే నాకు గుండె ఆగినంత పని అవుతుంది. అప్పుడు లేని భయం ఇప్పుడే ఎందుకు అంటే.. ఎదురుగా మీరెవరూ కనిపించడం లేదు. మీ మాట వినిపించడం లేదు. మీ కేరింతలు నా దరి చేరకుండా.. నన్ను ఒంటరిని చేశారు. కళామ్మతల్లి ముద్దుబిడ్డగా రాజ్యమేలిన నేను బిక్కు బిక్కుమంటూ అలరించలేని 'బొమ్మ'గా మిగిలిపోతున్నాను.

నన్ను చూసి మీరు పొందే భావోద్వేగాలు.. రాగ ద్వేషాలుగా మారడాన్ని నేను తట్టుకోలేకపోతున్నాను. పాప్ కార్న్ రేట్లు, టికెట్ ధరలంటూ వెలివేయడాన్ని భరించలేకపోతున్నాను. ఎలా బతికాను.. నన్ను ఎలా బతికించారు. నేను పొందుకున్న వైభవం ఏంటీ.. వైభోగం ఏంటీ.. ఇప్పుడిలా జీవచ్ఛవంలా బతకాల్సిన దుస్థితి ఏంటి? తలుచుకుంటేనే గుండె చెరువౌతోంది. కన్నీళ్లతో గుండె బరువెక్కుతోంది. నన్ను చూసి మీరు కొట్టే చప్పట్లు.. వేసే విజిల్స్ నాకు ఊపిరి పోసేవి. మిమ్మల్ని ఉర్రూతలూగించేట్టు చేసేవి. ఇప్పుడంతా మౌనం. థియేటర్స్ అన్నీ శూన్యం. గుడికైనా వెళ్లని వాళ్లుంటారేమో.. బడి మెట్లు తొక్కని వాళ్లుంటారేమో.. థియేటర్స్‌లో అడుగుపెట్టని వాడుండని పొంగిపోయాను. విజయోత్సవ సందడులతో విర్రవీగాను. తండోప తండాలుగా వస్తున్న మిమ్మల్ని చూసి పులకరించిపోయాను. కానీ ఇప్పుడు చూసేవాడే కరువయ్యాడు.

మీకు గుర్తుందా?? ఒకప్పుడు నాకు వందరోజుల ఫంక్షన్‌లు చేసేవారు. పాతిక, యాభై, వంద, నూటయాభై, రెండొందలు, ఏడాది ఇలా ఏళ్లకి ఏళ్లు నాకు ఫంక్షన్లు చేసేవారు. విజయోత్సవాలు నిర్వహించేవారు. థియేటర్స్ దగ్గరే విందు భోజనాలు ఏర్పాటు చేసేవారు. తొమ్మిదినెలలు బిడ్డని కడుపునమోసిన ముత్తైదువుని అలంకరించినట్టుగా నాకు అలంకరణ చేసేవారు. దేదీప్యమానంగా సింగారించేవారు. కానీ ఇప్పుడు నా పరిస్థితి చూస్తే నాపై నాకే జాలేస్తుంది.ముత్తైదువు లాంటి నన్ను ముండమోపిని చేసి చీకటి గదికి పరిమితం చేశారు.

ఊపిరాడటం లేదు ప్రేక్షకా.. ఊపిరాడటం లేదు.

అసలు నేను లేకుండా పండుగ అయ్యేదా? నేను లేకుండా పెళ్లి జరిగేదా? కాపురానికి వచ్చిన కొత్తఅల్లుడు నా గడప తొక్కకుండా కాపురం మొదలెట్టేవాడా? ఆఖరుకి చావులప్పుడు కూడా నా సినిమా పడాల్సిందే. తెరకట్టి మరీ సినిమా వేసి.. చనిపోయిన బాధని కూడా నాతోనే పంచుకునేవారే.. నన్ను చూస్తూ ఆ బాధను మర్చిపోయేవారే.. అలాంటిది ఇప్పుడు నన్ను బతికున్న శవాన్నిచేశారు.

ఎన్నిరోజులౌతుంది థియేటర్ దగ్గర హౌస్ ఫుల్ బోర్డ్ చూసి.. ఎన్ని రోజులౌతుంది 50, 100 రోజుల పోస్టర్లు చూసి.. ఎన్ని రోజులౌతుంది టికెట్స్ కౌంటర్ల దగ్గర క్యూ లైన్‌లు చూసి.. నాకోసం చొక్కాలు చింపుకున్న సినిమా ప్రేక్షకుడు ఏమయ్యాడు? నాకోసం కటౌట్లు కట్టిన సినిమా అభిమాని ఏమయ్యాడు.. నాకోసం థియేటర్స్‌లో విజిల్స్ కొట్టి పేపర్లు ఎగరేసిన సినిమా పిచ్చోడేమయ్యాడు. వందల వేల మంది ప్రేక్షకుల కరతాల ధ్వనులతో నా బొమ్మ పడుతుంటే ఇది కదా సినిమా పండుగంటే అని పరవశించిపోయిన నాకు ఈ కమ్ముకున్న చీకట్లను చూసి.. మూతపడిన థియేటర్స్ తలుపుల్ని చూస్తుంటే ఊపిరాడటం లేదు ప్రేక్షకా.. ఊపిరాడటం లేదు. థియేటర్‌లోని ఆ గబ్బిలాల అరుపులు అప్పట్లో నాకు సంగీత వాయిద్యాలుగా.. స్తోత్ర సంకీర్తనగా అనిపించేవి. కానీ ఇప్పుడు ఆ అరుపు వినిపిస్తుంటే భయంతో ప్రాణం పోతుంది. ఓటీటీ పేరు చెప్పి నన్ను నాలుగు గదులకే పరిమితం చేసి ఊపిరాడకుండా చేశారు. స్వేచ్ఛావాయువులు అందక చస్తూ బతుకుతున్నా. ఎలా ఉన్నావ్ అని పలకరించేవాడే లేడు. థియేటర్ దగ్గర సైకిల్ స్టాండ్ బాబాయ్ కనిపించడం లేదు.. బజ్జీలమ్మే పెద్దమ్మా పలకరించడం మానేసింది. ప్రొజెక్టర్ రీల్లు తిప్పే నా బంధుమిత్రుడూ నన్నొదిలేసి జీవనోపాధికి మరో మార్గం ఎంచుకున్నాడు.

అంతెందుకు మా అందర్నీ పోషించే థియేటర్ యజమాని.. ఎలా బతికాడు. సినిమా వచ్చిందంటే ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, పోలీసులు, పెద్ద పెద్దోళ్లంతా ఫోన్లు చేయాల్సిందే. టికెట్లు అడగాల్సిందే. కాలు మీద కాలేసుకుని ఎంత దర్జాగా బతికాడు.. ఎంత పెద్దోడొచ్చి టికెట్లు అడిగినా.. లేవ్.. హౌస్ ఫుల్ అనే గంభీరమైన మాట నా యజమాని నోట నుంచి వచ్చి ఎన్నేళ్లైంది. పెద్దమ్మాయి పెళ్లెప్పుడు చేస్తారండీ అని మా ఓనర్‌ని ఎవరైనా అడిగినప్పుడు.. వచ్చే సంక్రాంతి సినిమా పండుగ అయ్యాక అనేవారు. అంటే ఆ సంక్రాంతికి పెద్దమ్మాయి పెళ్లి చేసేటంత డబ్బొచ్చేది. అన్ని టిక్కెట్లు అమ్ముడయ్యేవి. కానీ.. ఇప్పుడు ఫస్ట్ డే.. ఫస్ట్ షోకి కూడా ప్రేక్షకుడు వచ్చే పరిస్థితి లేదు. నీదో వారం నాదో వారం అని పంచుకునే దౌర్భాగ్యం. టికెట్లు లేవ–య్యా అని అరిచిన అతని అరుపులు కాస్తా.. 'ఎవరైనా వస్తే బాగుండయ్యా' అని వణుకుతున్న గొంతు లో మాట్లాడుతుంటే గుండె తరుక్కుపోతుంది. ఎందుకు బతికున్నానా? అనిపిస్తుంది. అందుకే నేను ఇక బతకలేనూ.. కళామ్మతల్లీ నాకు పూర్వ వైభవం కావాలి.. సినిమా పండుగ తేవాలి. కరుణించమ్మా. ప్రేక్షక దేవుడ్ని నా వైపు నడపించమ్మా. లేదంటే నాకు చావే శరణ్యం.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,